http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 4 ఏప్రిల్ 2026

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## హైదరాబాద్‌లోని పలు పబ్బుల్లో
# ఈగల్ టీం తనిఖీలు

ఐఏఎస్ అధికారి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్

గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని పలు పబ్బుల్లో ఈగల్ బృందం తనిఖీలు

మొత్తం 64 మందికి డ్రగ్స్ టెస్టు నిర్వహించంగా 8 మందికి పాజిటివ్

పాజిటివ్ వచ్చిన వారిని పీఎస్‌కు తరలించిన పోలీసులు

## టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు..
# చేనేతలకు జీవితం

- తెలంగాణను దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్-2026
- ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉందన్న సీఎం
- టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు చేనేతలకు జీవితమని వెల్లడి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారడమే తమ ప్రభుత్వ లక్ష్యం




హైదరాబాద్

2047 నాటికి తెలంగాణ దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలోని నోవాటెల్‌లో ఆసియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్-2026లో పాల్గొన్న సీఎం టెక్స్‌టైల్స్ అనేది రాష్ట్ర ప్రజల డీఎన్‌ఏలోనే ఉందని అన్నారు. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారిందన్నారు. నాణ్యమైన వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదని చేనేతలకు జీవితమని చెప్పారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన ఆసియన్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్- 2026లో మంత్రులు శ్రీధర్‌బాబు, - మిగతా3లో



# ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి

- అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిదమాన్
- శత్రువులకు చిక్కని 'తారాగిరి'
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా కమిషన్
- అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం



# హర్మూజ్ జలసంధి సంక్షోభం

- నావికులను కోల్పోయిన ఏకైక దేశం భారత్
- హర్మూజ్ జలసంధి పునరుద్ధరణపై 60కిపైగా దేశాల సమావేశంలో భారత్ కీలక పాత్ర
- ముగ్గురు భారతీయ నావికుల మృతి, ఒకరికి గాయాలు
- ఇంధన భద్రతపై ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరిక

## నా మౌనాన్ని ఓటమిగా భావించొద్దు



- పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా?
- ఆప్ ఉపనేత పదవి నుంచి తొలగించడంపై రాఘవ్ చద్దా స్పందన
- పార్లమెంటులో నా గొంతు నొక్కేందుకు ఆప్ ప్రయత్నమని వ్యాఖ్య



## విజయ్ రెండు చోట్ల పోటీ..
## ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు


# కాంగ్రెస్‌లో గొంతు లేస్తోంది



- ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు
- అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా.
- అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్‌ని మించిన పార్టీ వేరొకటి లేదు
- అయితే అసంతృప్తులు అయినా అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది.
- కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు

హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్ ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు. ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు. - మిగతా3లో



## ఒక్కో గిరిజన కుటుంబానికి ఆవు, గేదె ఇస్తాం

- అస్సోం ఓటర్లకు అమిత్ షా హామీలు
- ఏప్రిల్ 9న అస్సోం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- ఈ క్రమంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు

## మందుబాబులకు 'పెగ్గు' మరింత ఖరీదు!

- మద్యం తయారీలో ముడిసరుకు కంటే ప్యాకేజింగ్ ఖర్చే ఇప్పుడు కంపెనీలకు భారంగా మారింది
- ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు



## 'ఇందిరమ్మ' దరఖాస్తుదారులకు
# అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లు

- ఆ జాబితాలోని అర్హులకు కేటాయింపు
- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల కోసం అపార్ట్‌మెంట్లు నిర్మించనున్న ప్రభుత్వం
- స్థలాలు లేని పేదలకు ఇక్కడే కేటాయింపులు
- బహుళ అంతస్థుల భవనాల నిర్మాణానికి ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు అనువుగా ఉన్నాయో గుర్తించాలని కలెక్టర్లకు ఆదేశాలు



హైదరాబాద్

హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో స్థలాల లభ్యత ఉన్నచోట ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల కోసం స్టిల్ట్?౦9, స్టిల్ట్?౦5, జీ౦3 అంతస్థుల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించాలని హౌసింగ్ శాఖ ప్రణాళికలు రూపొందించింది. ఎకరానికి స్టిల్ట్?౦9 అంతస్థుల్లో 200-220 ఫ్లాట్‌లు, స్టిల్ట్౦5 అంతస్థుల్లో 150-200, జీ౦3 విధానంలో 120-150 ఫ్లాట్‌లు నిర్మించి ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందుకు సుమారు 415-500 చదరపు అడుగుల మధ్యలో రెండు పడకల గదుల ఇళ్లు - మిగతా3లో



## రాజకీయ లబ్ది కోసమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు

- బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
- కేంద్రంపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత జైరాం రమేశ్
- తమిళనాడు, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొందేందుకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలని ఆరోపణ

# ఒక్కో గిరిజన కుటుంబానికి ఆవు, గేదె ఇస్తాం

అసోంలో వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చొరబాటుదారులను అరికడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అలాగే చొరబాటుదారులను అసోం నుంచి వెనక్కి పంపుతుందని వెల్లడించారు. గిరిజన వర్గాల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పెద్ద డెయిరీని ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను ఇస్తుందని స్పష్టం చేశారు. అసోంను కాంగ్రెస్ పార్టీ చొరబాటుదారులకు అడ్డాగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు అసోంలోని గోల్పారాలో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా వ్యాఖ్యానించారు. "కాంగ్రెస్ అసోంను చొరబాటుదారులకు కేంద్రంగా మార్చింది. వారి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన ప్రాంతాల్లోకి కూడా చొరబాటుదారులు వస్తారు. వరుసగా మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాటుదారులను ఎంపిక చేసి వెనక్కి పంపుతుంది. చొరబాటుదారులందరినీ గుర్తించాం. ప్రస్తుతం సమయం కొంచెం తక్కువగా ఉంది. మాకు ఐదేళ్ల సమయం ఇవ్వండి. మేము గుర్తించిన చొరబాటుదారులను దేశం నుంచి వెళ్లగొడతాం. కాంగ్రెస్ పాలనలో గిరిజన సమాజ అభివృద్ధికి కేటాయించిన బడ్జెట్ రూ. 25,000 కోట్లు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దాన్ని రూ. 1.38లక్షల కోట్లకు పెంచింది" అని అమిత్ షా పేర్కొన్నారు.

**గిరిజనుల సంక్షేమం గురించి కాంగ్రెస్ మాట్లాడదు : అమిత్ షా**

కాంగ్రెస్ పదేపదే ఎన్నికల్లో పోటీ చేయడానికి అసోంకు వస్తుందని, కానీ ఇక్కడి గిరిజనుల సంక్షేమం గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదని అమిత్ షా ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచాయని, కానీ వారు (కాంగ్రెస్) ఒక్క గిరిజన మహిళనూ రాష్ట్రపతిని చేయలేదని




అన్నారు. కేవలం ప్రధాని మోదీ మాత్రమే గిరిజన సోదరి ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేశారని వెల్లడించారు. "దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన వర్గాల కళ, సంస్కృతి, వంటకాలు, వస్త్రధారణ, సంగీతం, నృత్యాలను ప్రధాని మోదీ ప్రపంచ వేదికపై ప్రోత్సహించారు. ఈ దుధ్నోయ్ నదిని పాల నది అని పిలుస్తారు. అందుకే దీనికి దుధ్నోయ్ అనే పేరు వచ్చింది. ఇక్కడ ఒక్క డెయిరీ అయినా ఉందా?. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అసోంలో ప్రతి జిల్లాలోనూ ఒక డెయిరీని ఏర్పాటు చేస్తుంది. అలాగే ప్రతి గిరిజన కుటుంబానికి ఒక ఆవు, ఒక గేదెను అందిస్తుంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

**విపక్ష లేని పాలనను అందించడానికి ఎన్‌డీఏ కృషి : యూపీ సీఎం యోగి**

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేసిందని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అలాగే ఎన్‌డీఏ సర్కార్ సేవా దృక్పథంతో వివక్ష లేని పాలనా ప్రయోజనాలను దేశంలోని ప్రతి పౌరుడికి అందించడానికి కృషి చేస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం గత పదేళ్లలో అసోం పునరుజ్జీవాన్ని సాకారం చేయడానికి తన నిబద్ధతను చాటుకుందని చెప్పారు. కాంగ్రెస్ తన పాలనలో అసోంలో అరాచకత్వం, అల్లర్లు, చొరబాట్లను ప్రోత్సహించిందని ఆరోపించారు. తద్వారా అసోంలో పౌరుల భద్రతకు ఆటంకం కలిగించిందని మండిపడ్డారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో యోగి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్‌పై నితిన్ నబీన్ మండిపాటు**

అసోంకు దక్కాల్సిన హక్కులు దక్కేలా చూడటానికి తాము పోరాడుతామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కామరూప్?లో జరిగిన బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. ఆనాటి కాంగ్రెస్ సర్కార్ అక్రమంగా చొరబాటుదారులకు అప్పగించిన భూములను తిరిగి అసోం ప్రజలకు అప్పగించడానికి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్ కృషి చేసిందని కొనియాడారు.

**అసోంలో ఎన్‌డీఏ హ్యాట్రిక్ ఖాయం : కేంద్ర సహాయ మంత్రి పవిత్ర**

అసోంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజలు తమను ఆశీర్వదిస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా తెలిపారు. వరుసగా మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వమే అధికారం చేపట్టబోతోందని తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. నజీరా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మయూర్ బోర్గొహైన్ కనీసం 30,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని అంచనా వేశారు.

కాగా, అసోంలో ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికల పోలింగ్ జరగనుంది. మే 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. అధికార ఎన్‌డీఏ హ్యాట్రిక్ కొట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. పదేళ్ల తర్వాత అధికారాన్ని చేజిక్కించుకునేందుకు విపక్ష కాంగ్రెస్ కూటమి సర్వశక్తులు ఒడ్డుతోంది.

# రాజకీయ లబ్ది కోసమే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు

మోదీ సర్కార్ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించడంపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. బంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడం కోసమే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోందని విమర్శించింది. మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను ఆమోదించేందుకు ఇలా చేస్తోందని వ్యాఖ్యానించింది. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఘోరంగా ఉల్లంఘించడమేనని మండిపడింది. తొందరపాటుతో నియోజకవర్గాల పునర్విభజన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తుందని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు.

"నారీ శక్తి వందన అధినియమ్- 2023 బిల్లు ఆమోదం పొంది 30 నెలల అయ్యింది. ఇంతకాలం ప్రభుత్వం నిద్రపోయిందా ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ది కోసం ప్రభుత్వం ఇలా చేస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం గానీ, ప్రతిపాదన గానీ రాలేదు. అయితే అనధికారికంగా లోక్‌సభ సీట్లలో దామాషా ప్రకారం పెరుగుదల ఉంటుందని మాకు తెలిసింది. దామాషా ప్రకారం లోక్‌సభ సీట్లలో పెరుగుదల ఉంటుందని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి చిన్న రాష్ట్రాలు, అలాగే దక్షిణ, ఈశాన్య, పశ్చిమ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ప్రతిపాదిత బిల్లుతో ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ సీట్లు 120కి పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రమైన కేరళలో లోక్‌సభలో సీట్ల సంఖ్య గరిష్ఠంగా 40కి మాత్రమే చేరుకుంటుంది. అనధికారికంగా మాకు అందిన సమాచారం ప్రకారం దామాషా ప్రకారం లోక్‌సభ సీట్ల పెంపు చాలా రాష్ట్రాలకు ప్రమాదకరం" అని జైరాం రమేశ్ తెలిపారు.



**'15రోజుల తర్వాత ప్రత్యేక సమావేశాలు నిర్వహించొచ్చు కదా'**

ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను 15రోజుల తర్వాత (ఏప్రిల్ 29 తర్వాత) ఏర్పాటు చేయలేకపోయారా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. తమిళనాడు, బంగాల్ ఎన్నికలను ప్రభావితం చేయడం, రాజకీయ లబ్ధి పొందడమే లక్ష్యంగా ఈ స్పెషల్ సెషన్‌ను ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం కథన నిర్వహణ సూత్రంపై పనిచేస్తుందని ఆరోపించారు. "ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో ఉభయ సభలు సమావేశమవుతాయని, అందుకోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నారీ శక్తి వందన అధినియమ్‌లో సవరణలు చేసేందుకు కాంగ్రెస్‌తో చర్చలు జరపాలని ప్రభుత్వం కోరుకుంటోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మార్చి 16న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. దానిపై ఖర్గే స్పందిస్తూ ప్రభుత్వం విభజించి పాలించు విధానాన్ని పాటిస్తుందని అన్నారు. అందుకే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండడం, రాజకీయ పార్టీలు ఎన్నికల్లో బిజీగా ఉన్నందున ఏప్రిల్ 29 తర్వాతే ఆల్ పార్టీ మీటింగ్ ఏర్పాటు చేయాలని విపక్ష పార్టీలు మార్చి 24న రిజిజుకు లేఖలు రాశాయి. రెండు రోజుల తర్వాత అంటే మార్చి 26న రాజ్యాంగ సవరణపై చర్చలు జరిపేందుకు కాంగ్రెస్ తమను కలవాలని రిజిజు ఖర్గేకి లెటర్ రాశారు. ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశం జరపాలని ఖర్గే పునరుద్ఘాటించారు."

**మోదీ సర్కార్ ఏకపక్ష నిర్ణయం తీసుకుంది : జైరాం రమేశ్**

కేరళ, అసోం ఎన్నికలకు ముందు ఏప్రిల్ ఆరంభంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకుందని జైరాం రమేశ్ ఆరోపించారు. అయితే కొంతకాలం పాటు లేఖల మార్పిడి కొనసాగడంతో వారి ప్రయత్నం విఫలమైందన్నారు. ఇప్పుడు బంగాల్, తమిళనాడులో ఎన్నికల ప్రచారం జరుగుతున్నప్పుడు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా అమల్లో ఉన్న సమయంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని మోదీ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకుందని విమర్శించారు.

"ఈ లేఖలన్నింటిలో మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ గురించి మాత్రమే ప్రస్తావన ఉంది. కానీ ఇప్పుడు ఈ ప్రత్యేక సమావేశం నియోజకవర్గాల పునర్విభజన గురించి కూడా అని స్పష్టమైంది. డీలిమిటేషన్ కూడా అజెండాలో ఉందని కిరణ్ రిజిజు ఎప్పుడూ చెప్పలేదు. 2023 సెప్టెంబర్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందినప్పుడు జనాభా లెక్కలు, డీలిమిటేషన్ తర్వాత దానిని అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన వరకు అవసరం లేదు, వెంటనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే అప్పట్లో డిమాండ్ చేశారు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# హార్మూజ్ జలసంధి సంక్షోభం

పశ్చిమాసియా సంక్షోభం తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ప్రపంచానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి పరిస్థితిపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ జలసంధిలో జరిగిన దాడుల్లో ఇప్పటివరకు భారతీయ నావికులే ప్రాణాలు కోల్పోవడం గమనార్హమని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జలసంధిని తిరిగి తెరవాల్సిన అవసరాన్ని భారత్ బలంగా నొక్కి చెప్పింది.

**అంతర్జాతీయ జలమార్గాల భద్రత అత్యంత కీలకం**

బ్రిటన్ నేతృత్వంలో 60కిపైగా దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ వర్చువల్ సమావేశంలో భారత్ తరపున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పాల్గొన్నారు. ఆ సమావేశంలో సముద్రయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ జలమార్గాల భద్రత అత్యంత కీలకమని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ వాణిజ్యానికి, ముఖ్యంగా ఇంధన సరఫరాకు హార్మూజ్ జలసంధి ఎంత ముఖ్యమో వివరించింది.

**నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

హార్మూజ్ జలసంధి ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వాటాను కలిగి ఉంది. ఈ మార్గం మూసివేయడం వల్ల గ్లోబల్ మార్కెట్లలో చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడుతోందని అధికారులు తెలిపారు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద ముడి చమురు దిగుమతి దేశాల్లో ఒకటి కావడంతో, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

**సముద్ర భద్రతపై మరింత అప్రమత్తంగా!**

ఇప్పటివరకు హార్మూజ్ జలసంధిలో జరిగిన దాడుల్లో విదేశీ జెండాలు కలిగిన వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. మరో నావికుడు



గాయపడ్డాడు. ఈ విషయాన్ని భారత షిప్పింగ్ డైరెక్టరేట్ జనరల్ ధ్రువీకరించింది. ఈ ఘటనల నేపథ్యంలో భారత్ సముద్ర భద్రతపై మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

**దేశానికి సవాలు**

సమావేశంలో విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ, ప్రస్తుత సంక్షోభానికి ఏకైక పరిష్కారం యుద్ధం ముగింపు మరియు చర్చల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. అన్ని దేశాలు పరస్పర సంభాషణ ద్వారా ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. దౌత్య మార్గమే శాంతి సాధనకు ఉత్తమ మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలు భారత్ ఇంధన భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో స్థిరత్వం లేకపోవడం వల్ల సరఫరా వ్యవస్థ దెబ్బతింటోందని, ఇది దేశానికి సవాలుగా మారుతోందని చెప్పారు. ఇదిలా ఉండగా, కీలక సమావేశానికి అమెరికా తరపున ఎవరూ హాజరుకాలేదు. ఇది అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఇతర దేశాలు కలిసి సమస్య పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తున్నాయి. గల్ఫ్ దేశాల్లో సుమారు ఒక కోటి భారతీయులు నివసిస్తున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అన్ని దేశాల్లోని భారత రాయబార కార్యాల యాలు అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది.

**204 మంది భారతీయులను భూభాగ మార్గం ద్వారా!**

ఇప్పటివరకు ఈ సంక్షోభంలో మొత్తం ఎనిమిది మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఒకరు ఇంకా కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 204 మంది భారతీయులను భూభాగ మార్గం ద్వారా అజర్‌బైజాన్‌కు తరలించారు. మరికొందరిని కూడా త్వరలో తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తంగా హార్మూజ్ జలసంధి సంక్షోభం ప్రపంచానికి గంభీర హెచ్చరికగా మారింది. ముఖ్యంగా భారత్ వంటి ఇంధన దిగుమతులపై ఆధారపడిన దేశాలకు ఇది పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవాలంటే అంతర్జాతీయ సహకారం, చర్చలు, శాంతి చర్యలే కీలకమని భారత్ స్పష్టం చేసింది.

## ఇండియన్ నేవీ అమ్ములపొదిలోకి

భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అణుశక్తితో రూపొందించిన జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిదమాన్‌ను లాంఛనంగా ప్రవేశపెట్టారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఫలితంగా అణు నావికాదళ విభాగం మరింత బలోపేతం అయింది. అంతకుముందు అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ తారాగిరి శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమానికి సీడీఎస్ జనరల్ అనిల్ చౌహన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. భారత్ అత్యంత గోప్యంగా షిప్ సబ్‌మెర్సిబుల్ బాలిస్టిక్ న్యూక్లియర్ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చింది. ఈ ప్రాజెక్ట్ కింద ఐఎన్‌ఎస్ అరిహంత్ మొదటి నౌక కాగా, దాని తర్వాత ఐఎన్‌ఎస్ అరిఘాట్ అనే మరో నౌక వచ్చింది. తాజాగా మూడో నౌక ఐఎన్‌ఎస్ అరిదమాన్?ను కమిషన్ చేశారు. విశాఖపట్నంలో నిర్మించిన ×చీా అరిదమాన్‌ను ఈ నౌకను అనేక నెలల పాటు సముద్ర పరీక్షలు చేసిన తర్వాత నౌక దళంలోకి ప్రవేశపెట్టారు. ఐఎన్‌ఎస్ అరిహంత్ భారత్ మొట్టమొదటి స్వదేశీ అణు జలాంతర్గామి. దీనిని జూలై 2009లో ప్రారంభించి 2016లో నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రెండో నౌక ×చీా అరిఘాట్‌ను ఆగస్టు 2024లో ప్రవేశపెట్టింది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్న కొన్ని దేశాల జాబితాలో భారత్? కూడా చేరింది. ప్రస్తుతం అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వద్ద ఈ జలాంతర్గాములు ఉన్నాయి.

**శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం**

స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన తారాగిరి భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు వివరించాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ యుద్ధనౌక ప్రత్యేకత. ఐఎన్‌ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.

**ఐఎన్‌ఎస్ తారాగిరి విశేషాలివే**

149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువు ఉండే ఐఎన్‌ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు. ఇందులో నిశ్శబ్ద ఫిరంగుల (స్టెల్త్ ఫ్రిగేట్)తో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది. భారత్‌ను బలమైన నౌకాదళ శక్తిగా తీర్చిదిద్దడంలో నావల్ సైన్స్, టెక్నలాజికల్ లాబొరేటరీ చేస్తున్న కృషిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు.

## మందుబాబులకు 'పెగ్గు' మరింత ఖరీదు!

పశ్చిమాసియాలోని యుద్ధ భయం భారత్‌లో మందుబాబుల పాలిట శాపంగా మారింది. ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు మన దేశంలోని మద్యం బాటిళ్ల ధరలను పెంచేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు వీటి ధరలు పెరగకపోయినా సమీప భవిష్యత్తులో మద్యం మరింత ప్రియం కానుందని కొందరు భావిస్తున్నారు. మద్యం తయారీలో ముడిసరుకు కంటే ప్యాకేజింగ్ ఖర్చే ఇప్పుడు కంపెనీలకు భారంగా మారింది. దీనికి ప్రధాన కారణం సహజ వాయువు. మద్యం బాటిళ్లు తయారు చేసే గాజు ఫర్నేస్‌లను(కొలిమి) నిరంతరం మండించాలంటే గ్యాస్ తప్పనిసరి. బీర్ తయారీ ఖర్చులో ప్యాకేజింగ్ వాటా సుమారు 40% కాగా, స్పిరిట్స్ (విస్కీ, బ్రాండీ తదితరాలు)లో ఇది 20% వరకు ఉంటుంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సహజ వాయువు దిగుమతిదారు అయిన భారత్ తన అవసరాల కోసం 40% వరకు ఖతార్ పైనే ఆధారపడుతోంది. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం వల్ల గ్యాస్ సరఫరాకు ఆటంకం ఏర్పడితే అది నేరుగా గాజు బాటిళ్ల ఉత్పత్తిపై దెబ్బకొడుతుంది.

**ధరల పెరుగుదల ఎంత ఉండవచ్చు?**

ఇండియన్ మాల్ట్ విస్కీ అసోసియేషన్ (ఐఎండబ్ల్యూఏ) డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ రాజేష్ చోప్రా అంచనా ప్రకారం, కేవలం గ్యాస్ ధరల వల్లే గాజు బాటిళ్ల ధర 15-20% పెరిగింది. దీనికి అదనంగా షిప్పింగ్ ఛార్జీలు తోడవ్వడంతో కంపెనీలు బ్రాండ్ల వారీగా 10-15% ధరల సవరణ కోరుతున్నాయి. ముఖ్యంగా ప్రీమియం సెగ్మెంట్లలో ఈ ప్రభావం తక్షణమే కనిపించనుంది.

## నా మౌనాన్ని ఓటమిగా భావించొద్దు

రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపనేత పదవి నుంచి తొలగించడంపై ఎంపీ రాఘవ్ చడ్డా స్పందించారు. ఈ వ్యవహారంపై తాను మౌనంగా ఉన్నానంటే దాని ఉద్దేశం ఓడిపోయినట్టు కాదన్నారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని రాఘవ్ చడ్డా విడుదల చేశారు. పార్లమెంటులో తన గొంతు నొక్కేందుకు సొంత పార్టీయే ప్రయత్నించిందని మండిపడ్డారు. తనకు ఎప్పుడు అవకాశం లభించినా, ప్రజా సమస్యలనే ప్రస్తావించినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని ఆప్ నాయకత్వం, రాజ్యసభ సెక్రటరీని కోరుతూ లేఖ రాయటం తనను విస్మయానికి గురిచేసిందన్నారు. సామాన్యులకు మేలు చేసే ఎన్నో అంశాలను తాను లేవనెత్తానన్న రాఘవ్ చడ్డా, దానివల్ల ఆమ్ ఆద్మీ పార్టీకి వచ్చిన నష్టం ఏమిటని నిలదీశారు. తాను ప్రజల పక్షాన ఉంటానని, వారికోసం ఎంత దూరమైనా వెళ్తానని రాఘవ్ చడ్డా స్పష్టం చేశారు. "పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా? నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, టోల్ ప్లాజా దోపిడీ, గిగ్ వర్కర్ల సమస్యలు, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే అది ఆమ్ ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా. దీని వల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయ గలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తాను. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకు పడతా" మరోవైపు రాఘవ్ చడ్డా వ్యాఖ్యలపై ఆప్ స్పందించింది. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఆయన భయపడుతున్నారని ఆరోపించింది. ఎయిర్‌పోర్ట్ క్యాంటీన్లలో సమోసా ధరలు తగ్గించడం వంటి అంశాలపై మాట్లాడటం ఏంటి అని ప్రశ్నించింది. "మేము అరవింద్? కేజ్రీవాల్ సైనికులం. నిర్భయత్వం మా సహజ లక్షణం. మోదీని చూసి భయపడేవాడు అసలు దేశం కోసం ఎలా పోరాడగలడు? పార్లమెంటులో ఒక పార్టీకి మాట్లాడటానికి పరిమిత సమయం మాత్రమే కేటాయిస్తారు. ఆ సమయం లోపల ఒకరు దేశాన్ని రక్షించడానికి పోరాటం చేయవచ్చు. లేదా కేవలం విమానాశ్రయ క్యాంటీన్‌లో సమోసాల ధరలు తగ్గించమని కూడా ప్రచారం చేసుకోవచ్చు. గుజరాత్‌లో మా పార్టీ కార్యకర్తలను వందల సంఖ్యలో బీజేపీ నియంత్రణలో ఉన్న పోలీసులు అరెస్టు చేశారు.

## విజయ్ రెండు చోట్ల పోటీ..

## ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు

తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తోన్న విషయం తెలిసిందే. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ వేయగా.. ఇందుకు సంబంధించి విజయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయ పరిశీలనకు దారితీయవచ్చని పలువురు అంటున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు విరుద్ధంగా ఉన్నట్లు సమాచారం. పెరంబూర్‌లో ఇచ్చిన అఫిడవిట్‌లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. అదే తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. మరోవైపు, ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతా తెరిచామని, ఇందులో రూ.లక్ష రూపాయలు ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్‌లో పేర్కొనగా.. తిరుచ్చి అఫిడవిట్‌లో మాత్రం రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొన్నట్లు తెలిసింది.

# ‘ఇందిరమ్మ’ దరఖాస్తుదారులకు అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు

-మొదటిపేజీ తరువాయి
ఉండేలా ఆకృతులను రూపొందించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్? పరిధిలో 5 మురికి వాడలను, వాంబే, ఈడబ్ల్యూఎస్ పథకాల కింద నిర్మించి శిథిలావస్థకు చేరిన మరో 12 కాలనీలను గుర్తించారు.

**గ్రౌండ్ ఫ్లోర్‌లో గదులు ఉండవు**
మేడ్చల్ జిల్లాలో 28 ప్రాంతాల్లో సర్కారు స్థలాలను గుర్తించారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో ఇక్రిశాట్ వద్ద 5 ఎకరాలు, మార్ఠ్వ నగర్‌లో ఆరు ఎకరాలు, లక్డారంలో 130 ఎకరాల్లో బహుళ అంతస్థుల భవనాలు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చింది. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్‌లలో కూడా ఇదే తరహాలో ఇళ్లను నిర్మించి, పేదలకు ఇవ్వాలని భావిస్తోంది. ఈ స్టిల్ట్ పద్ధతిలో నిర్మించే బహుళ అంతస్థుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో గదులు ఉండవు. ఇక్కడ వాహనాల పార్కింగ్, వాణిజ్య సముదాయాల గదులను నిర్మిస్తారు. జీం3 విధానంలో మాత్రం గ్రౌండ్ ఫ్లోర్‌లో గదులను నిర్మించి ఇస్తారు.

**ఎల్-2 జాబితాకు కేటాయింపులు ఇలా**
రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 77.68 లక్షల దరఖాస్తులు వచ్చాయి. చాలా వరకు ఇళ్లకు అర్హత ఉండి, స్థలాలు లేని దరఖాస్తుదారులు 2.14 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం స్థలాలు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లను కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షలను మంజూరు చేస్తోంది. ఇప్పుడు ఎల్-2 జాబితాలోని పేదల కోసం అపార్ట్?మెంట్?లు కట్టి, ఫ్లాట్?లను కేటాయించనుంది. శిథిలావస్థకు చేరిన కాలనీల్లోని వారికి కూడా అవకాశం ఇవ్వనుంది. ప్రస్తుతం బహుళ అంతస్థుల భవనాలకు ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు అనువుగా ఉన్నాయో గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది.

**ఇళ్ల కేటాయింపునకు 20 ప్రాంతాలు గుర్తింపు**
నగరంలో పేదల గల్లీల్లో సర్కారు ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మాణం చేపట్టనుంది. గతంలో కేటాయించిన వాంబే, ఈడబ్ల్యూఎస్? ఇళ్ల సముదాయాల్లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూలగొట్టి అక్కడ జీప్లస్ం3 పద్ధతిలో నిర్మిస్తారు. అక్కడ ఎవరెవరు అర్హులుగా ఉన్నారనేది గుర్తించి ఇళ్లను కేటాయిస్తారు. దాదాపు నగరంలోని హౌసింగ్ బోర్డు, రెవెన్యూ అధికారులు 20 ప్రాంతాలను గుర్తించారు. అక్కడ ప్రస్తుతం మూడు వేల మంది నివాసం ఉంటున్నారు. జీ ప్లస్ం3 భవనాలను నిర్మించి 9 వేల మందికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోనున్నారు. అంతేకాదు ఈ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా హౌసింగ్? బోర్డు నుంచి ప్రాజెక్టు డైరెక్టర్?గా అశోక్? చక్రవర్తిని నియమించారు. హైదరాబాద్?లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆయనే పర్యవేక్షిస్తారు. ఆ ఫ్లాట్లు విశాలంగా ఉండేలా డిజైన్లను తయారు చేశారు. ఓల్డ్? పాటిగడ్డ, బండ్లగూడ, మాంగార్? బస్తీ, ఆఫ్జల్?సాగర్?లలో అర్హులతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.

**గృహప్రవేశాలకు సిద్ధమైన ఇందిరమ్మ ఇళ్లు**
మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులైన వారికి గృహప్రవేశాలకు రంగం సిద్ధమైంది. వీరంతా ఏప్రిల్?, మే, జూన్? నెలల్లో నూతన గృహాల్లోకి అడుగుపెట్టే విధంగా గృహనిర్మాణ శాఖ ఏర్పాట్లు ముగిశాయి. ఏప్రిల్ 1వ తేదీన 4,100 మంది ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు తమ కొత్త ఇళ్లలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే రాష్ట్రంలో ఉగాది కంటే ముందుగానే 9676 మంది, పండగ రోజు మరో 900 మంది నూతన ఇళ్లలోకి అడుగు పెట్టారు. ఈ నెల చివరి నాటికి మొత్తం 33 వేల మంది లబ్ధిదారులు నూతన ఇళ్లలోకి మారనున్నారు. మే ఆఖరిలోగా 60 వేలకు చేరుకునే విధంగా ప్లాన్? చేసి ఆ తర్వాత మరో 40 వేల ఇళ్లను జూన్?లో మంజూరు చేయడానికి నిర్ణయించారు.

# అడ్డూ, అదుపు లేకుండా ఫీజులు
# నిద్రౌతున్న విద్యాశాఖ




**నల్గొండ వరంగల్ :** జూన్ లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఎలా ఉంటాయన్న ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో మొదలైంది. ఇప్పటికే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లో ఫీజులు పెంచుతున్న సంకేతాలు యాజమాన్యాల నుంచి తల్లిదండ్రులకు అందాయి. పరిస్థితులు ఎలా ఉన్నా యాజమాన్యాలు ఏడాది కోసారి 20 నుంచి 30 శాతం ఫీజులు పెంచేస్తున్నాయి. నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫీజుల భారం లేకుండా చేస్తామని గత సర్కార్ కమిటీల పేరిట సాగదీసింది. పస్తుత ప్రభుత్వం గద్దెనెక్కి రెండేం డ్లు దాటినా ఫీజుల దోపిడీని అరికట్టలేకపోయింది. ఇది వచ్చే విద్యాసంవత్సరానికైనా అమల్లోకి వస్తుందా అన్నది సంశయంగానే ఉంది. దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో విద్యా సంవత్సరం అంటే ఫీజుల దోపిడీ అన్నట్టుగా మారింది. ఇంజినీరింగ్ విద్యకు అత్యధిక వార్షిక ట్యూషన్ ఫీజు రూ.1.83 లక్షలు. అదే పాఠశాల విషయానికి వస్తే కార్పొరేట్ స్కూళ్లలో రూ.5 లక్షలు! పటాన్చెరు ప్రాంతానికి చెందిన ఓ పాఠ శాల కొద్దిరోజుల క్రితం పాఠ్యపుస్తకాల ధరలను రూ.18 వేలకు పెంచింది. అలాగే పేరొందిన ప్రముఖ విద్యా సంస్థలు ఆరో తరగతి ఫీజును అమాంతం 30 వేల రూపాయలు అదనంగా పెంచాయి! దీన్ని సాకుగా చూపెడుతూ కొన్ని యాజమాన్యాలు మా దగ్గర ఫీజు తక్కువగా ఉంది. బయట చూడండి మీకే తెలుస్తుంది అంటూ ఏదో తక్కువ చేస్తున్నట్టు నటి స్తూ అందినకాడికి దండుకుంటున్నాయి. ఇలాగైతే సామా న్యుల పిల్లలకు విద్య అందేనా? ఈ దోపిడీకి కళ్లెమెప్పుడు? ఈ ప్రశ్నే తల్లిదండ్రుల గుండెలో ఇప్పుడు ఒక ఆందోళనగా ఉంటోంది. ఇంత బహిరంగంగా ఫీజుల్ని పెంచుతుంటే, ప్రభుత్వ పెద్దల కట్టడి చేసే చర్యలు మాటలకే పరిమితం కావడం శోచనీయం. ప్రభుత్వం ఏడాది క్రితమే ఫీజుల నియంత్రణకు చట్టం తెచ్చేందుకు బిల్లు నమూనా సిద్ధమైనప్పటికీ, దాని పై ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనేక అంశాలపై బిల్లులు ఆమోదం పొంది నా ఫీజుల బిల్లును మాత్రం ఆమోదానికి పెట్ట లేదు. దీని వెనుక అంతర్య మేంటి? వ్యక్తిగత అంశాలపై సవాల్ విసురు కునేందుకు సమయం కేటాయించిన అధికార, ప్రధాన ప్రతిపక్షసభ్యులు లక్షల మందికి ఉపయోగపడే బిల్లు గురించి ఎందుకు మాట్లాడలేదు? కావాలనే పక్కన పడేశారా అన చర్చ ఇప్పుడు నడుస్తోంది. దీనికి జవాబు పాలకులే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాలల ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని 2022 జనవరి 17న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, ఆచరణలో అడుగు కూడా ముందుకు పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత సర్కార్ రుసుములను కట్టడి వేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని 2024 సెప్టెంబర్లో ప్రకటించింది. రాష్ట్ర విద్యాకమిషన్ కూడా దీనికోసం చట్టం తీసుకురా వాలని స్పష్టంగా సిఫార్సు చేసింది. అయినప్పటికీ అమల్లోకి రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఒకవైపు విద్య వంటి ప్రాథమిక హక్కు విషయంలో ఇలా ఆలస్యం చేయడం అనేక అనార్థాలకు దారితీస్తుందని మేధావులు, విద్యావేత్తల అభిప్రాయం. ఇంకోవైపు, అందరికీ అందుబా టులో నాణ్యమైన విద్య అనే నినాదం ప్రజలను ఆకర్షించేలా ఉన్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు దానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్థాయిలో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామనే ప్రకటనలు వినిపిస్తున్నాయి. యంగ్ ఇండియా వంటి పేర్లతో కొత్త ప్రభుత్వ పాఠశాలల ప్రచారం జరగడం ఒకవైపు ఆశాజనకంగా కనిపించినా, టెక్నో, గ్లోబల్, ఒలింపియాడ్ వంటి పేర్లతో ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో దోచుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ఫీజులు పెంచుకునేందుకు పాలకవర్గాలే అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అదనపు ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో మరింత భారాన్ని మోపుతు న్నాయి. దీనివల్ల మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణి పెరుగు తున్నప్పుడు, ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. కానీ, లేకపోవడం బాధాకరం. విద్య అనేది లాభాపేక్షతో నడిచే రంగం కాకూడదు. అది సమాజ అభివృద్ధికి పునాది. అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. దీన్ని నిర్వర్తించడంలో ఆలస్యం చేయడమంటే భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టినట్టే. ఇలాంటి పరిస్థితుల్లో మాటలు కాకుండా చర్యలు అవసరం. ఇప్పటికైనా ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. ఆ చట్టంలో ప్రతి పాఠశాల ఫీజుల నిర్మాణం పారదర్శ కంగా ఉండేలా నిబంధనలు పెట్టాలి. నియంత్రణ సంస్థను ఏర్పాటు చేసి, ఫీజుల పెంపుపై పర్యవేక్షణ చేయాలి.

# టార్గెట్ హరీష్ రావు...

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు మాజీ మంత్రి హరీష్ రావు చుట్టూ తిరుగుతున్నాయి. నిన్నటి వరకు కేటీఆర్, కవితలపైనే విమర్శనాస్త్రాలు సంధించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన రూటు మార్చి హరీష్ రావును టార్గెట్ చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా హరీష్ రావుపై భూకబ్జా ఆరోపణలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి నేరుగా పేరు ఎత్తకపోయినా, హరీష్ రావును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపాయి. ముఖ్యంగా కన్న తండ్రిని పట్టించుకోని వారు.. ప్రజలను ఏం పట్టించుకుంటారు అనే అర్థం వచ్చేలా రేవంత్ చేసిన ఆరోపణలు హరీష్ రావును తీవ్రంగా ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. రాజకీయాల్లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్ రావుపై ఇలాంటి వ్యక్తిగత , అవినీతి ఆరోపణలు రావడం ఆయన ఇమేజ్‌కు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే హరీష్ అనుచరులు, ఆయనకు సంబంధించిన భూ వ్యవహారాలపై విచారణకు ఆదేశించడం ఆయనను మరింత ఒత్తిడిలోకి నెట్టింది. ఈ పరిణామాల మధ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు కొత్త ట్విస్ట్‌ను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి కావాలనే హరీష్ రావును ఒంటరిని చేస్తున్నారని, కేటీఆర్ మరియు



కవితలతో రేవంత్ కున్న రహస్య ఒప్పందంలో భాగంగానే ఈ వ్యూహం నడుస్తోందని సంజయ్ ఆరోపించారు. అంటే, బీఆర్ఎస్ పార్టీని హరీష్ రావు చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడానికి, కల్వకుంట్ల కుటుంబంలోని అంతర్గత విభేదాలను రేవంత్ తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నది బీజేపీ వాదన. ఈ ఆరోపణల్లో నిజమెంత ఉన్నా, రేవంత్ రెడ్డి ఒక్కసారిగా హరీష్ పై పడటం వెనుక బీఆర్ఎస్ కేడర్‌ను గందరగోళానికి గురిచేసే ప్లాన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి పరిస్థితులు హరీష్ రావుకు వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వపరంగా విచారణలు, ఇటు రాజకీయంగా సొంత పార్టీలోనే ప్రాధాన్యత తగ్గిపోతోందన్న ప్రచారం ఆయనను ఆత్మరక్షణలో పడేశాయి. కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే హరీష్ రావుపై ఈ స్థాయిలో దాడులు జరగడం యాదృచ్ఛికం కాదని రాజకీయ పండితులు భావిస్తున్నారు. హరీష్ రావుకు ఉన్న మాస్ ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా బీఆర్ఎస్‌ను బలహీనపరచవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో లేదా పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు సంక్షోభాలను చక్కదిద్దే హరీష్ రావు, ఇప్పుడు తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. రేవంత్ రెడ్డి విసురుతున్న సవాళ్లను ఆయన ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే హరీష్ రావు తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ విసిరారు. కానీ, అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీజేపీ నేతల విమర్శల మధ్య ఆయన తన పట్టును ఎలా నిలుపుకుంటారో చూడాలి. రేవంత్ రెడ్డి వర్సెస్ హరీష్ రావు పోరు రాబోయే రోజుల్లో మరింత ముదిరే అవకాశం ఉంది. ఒకవైపు ప్రజా సమస్యలపై పోరాడుతూనే, మరోవైపు తనపై వస్తున్న అవినీతి మరకలను తొలగించుకోవాల్సిన బాధ్యత హరీష్ పై ఉంది. రేవంత్ రెడ్డి చేస్తున్న ఈ మైండ్ గేమ్ ‘ బీఆర్ఎస్‌లో చీలిక తెస్తుందా లేక హరీష్ రావును మరింత బలమైన నేతగా మారుస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం

-మొదటిపేజీ తరువాయి
తుమ్మలతో కలిసి సీఎం పాల్గొన్నారు. టెక్స్‌టైల్స్ అనేది రాష్ట్ర ప్రజల డీఎన్?ఏలోనే ఉందన్న సీఎం అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా ఉందని వెల్లడించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మారడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారిందని అన్నారు.

**అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులు**
చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దఎత్తున సహకరిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల చెప్పారు. చేనేతలకు తమ ప్రభుత్వం చేతినిండా పని కల్పిస్తోందని వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ఉత్పత్తులను తెలంగాణ నేతన్నలు ఉత్పత్తి చేస్తున్నారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ ఫ్యాషన్ కారిడార్లు నిర్మిస్తున్నట్టు చెప్పుకొచ్చారు.

**తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యం కావాలి**
తాము ప్రపంచస్థాయి ఫ్యాషన్ కారిడార్లు, సర్క్యూలర్ హబ్స్‌ను నిర్మిస్తున్నామని మంత్రి శ్రీధర్? బాబు పేర్కొన్నారు. ఎంత ఉత్పత్తి చేస్తామని అడగొద్దని ఎంత నాణ్యతతో వస్త్రాలు తయారు చేస్తామో చూడాలన్నారు. ఇక్కడ ఒక ఎకో సిస్టమ్‌ను నిర్మిస్తున్నామన్న ఆయన మేడ్ ఇన్ తెలంగాణ అనేది కేవలం లేబుల్ మాత్రమే కాదు అది విశ్వసనీయతకు, నైతిక శ్రమకు భరోసా అని చెప్పారు. చేనేత పరిశ్రమ ఆత్మ దెబ్బతినకుండా తమ ఆర్థిక వ్యవస్థలను వృద్ధి చేసుకోగలమనే భరోసాకు అది ఒక ప్రతీక అని అన్నారు. పర్యావరణ పరిరక్షణే తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యతన్న సీఎం తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. “మా డీఎన్ఏలోనే టెక్స్‌టైల్స్ ఉందని తెలంగాణ ప్రజలు గర్వంగా చెప్పుకోవచ్చు. పోచంపల్లి ఇక్కత్ నుంచి గద్వాల చీరల వరకు, వరంగల్ దురీస్ నుంచి నారాయణపేట చీరల వరకు ప్రసిద్ధి. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు చేనేతలకు జీవితమది. 2047 నాటికి దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. మా దగ్గర అత్యుత్తమ మానవ వనరులు ఉన్నాయి. మనందరం కలిసికట్టుగా ప్రపంచానికే గేమ్ ఛేంజర్‌గా నిలిచే సమగ్ర వస్త్ర పర్యావరణ వ్యవస్థను సృష్టించగలం”

## హైదరాబాద్‌లోని పలు పబ్బుల్లో ఈగల్ టీం తనిఖీలు

మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా తెలంగాణ ఈగల్ టీం పోలీసులు హైదరాబాద్‌లో నిఘాను మరింత ముమ్మరం చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొండాపూర్‌లోని అరెనా పబ్‌లో పలువురికి అత్యాధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్‌ల ద్వారా మొత్తం 64 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా 8 మందికి పాజిటివ్ అని తేలింది. పబ్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. కేవలం స్థానిక పోలీసులే కాకుండా, ఈగల్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు.

**డ్రగ్స్ వినియోగిస్తే చర్యలు తప్పవు**
నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద పలు కేసులు నమోదు చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువకులు పబ్‌కు వచ్చేముందే మాదకద్రవ్యాలు సేవించారా? డ్రగ్స్ వీరికి ఎలా లభిస్తున్నాయి అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పబ్ కల్చర్ పేరుతో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని అన్ని ప్రధాన పబ్‌లపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు తెలిపారు.

**ఐఏఎస్ అధికారిణి కుమారుడు**
గంజాయి, బెంజోడియాజెపిన్, మెథాంఫెటమైన్ వంటి ప్రమాదకర మత్తుపదార్థాలను వినియోగించినట్లు పరీక్షల్లో తేలిందని ఈగల్ పోలీసులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. డ్రగ్ టెస్ట్ చేయగా పాజిటివ్ అని తేలిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి కుమారుడు ఉన్నట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్‌లో గొంతు లేస్తోంది

-మొదటిపేజీ తరువాయి
ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్ లో పడేశాయని అంటున్నారు ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు. ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు. జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు. ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు. ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్ లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు

## మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో కీలక మార్పులు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పౌర సేవలను డిజిటల్ రూపంలో ప్రజలకు చేరవేసే మీ సేవ కేంద్రాల ఛార్జీల విషయంలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. 15 ఏళ్లుగా ఉన్న పెంపు డిమాండ్‌ను ఇన్ని రోజులు నెరవేర్చారు. ఇప్పుడు పెరిగిన ఛార్జీల ప్రకారం ఏయే సర్టిఫికెట్లకు ఎంత వసూలు చేస్తారో చూద్దాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు ఉత్తర్వుల మేరకు, బుధవారం నుంచి అన్ని రకాల పౌరసేవలపై వినియోగ ఛార్జీలు పెరిగాయి. గతంలో కేవలం వినియోగ ఛార్జీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ప్రభుత్వం వీటికి 18 శాతం జీఎస్టీని అదనంగా చేర్చింది. మీ సేవలో అందించే సేవలను ప్రధానంగా రెండు కేటగిరీలుగా విభజిస్తారు. కేటగిరి ఏలో ఉండే డాక్యుమెంట్ స్కాన్ లేదా సంబంధిత విభాగాల విచారణ అవసరం లేని సేవలు ఉంటాయి. గతంలో దీనికి 35 రూపాయలు వసూలు చేసే వారు. ఇప్పుడు దీన్ని 62 రూపాయలకు పెంచారు. కేటగిరి బీలో వివిధ శాఖల విచారణ లేదా పరిశీలిన తర్వాత అందించే సేవలు వస్తాయి. ఈ కేటగిరి కింద అందించే సేవలకు 45 రూపాయలు తీసుకునే వాళ్లు. ఇప్పుడు దాన్ని 80 రూపాయలకు పెంచారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రకటించిన పెంపు 50శాతమే అయినప్పటికీ జీఎస్టీని కూడా పరిగణలోకి తీసుకుంటే ఈ భారం 77 శాతం నుంచి 78 వరకు పెరుగుతుంది. ఈ ధరల పెంపు ముఖ్యంగా సర్టిఫికెట్లు కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లి వారిపై ప్రభావం చూపనుంది. ఇప్పటి వరకు కుల ధ్రువీకరణ పత్రం తీసుకునే వారు కేవలం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ కోసం 80 రూపాయలు చెల్లించాలి.

## సంపాదకీయం

# అమెరికా అడుగుపెట్టేది ఇక్కడే!

ఇరాన్ గడ్డపై అమెరికా సైనికులు అడుగుపెట్టడం దాదాపుగా ఖరారైంది. ఈ నెల 6వ తేదీతో ముగిసే యుద్ధ విరామం గడువు పొడగింపు అవుతుందా లేదా అన్నది అమెరికా సైనికుల మోహరింపుపై ఆధారపడి ఉన్నది. మోహరింపు పూర్తయి.. యుద్ధానికి పూర్తిగా సన్నద్ధం అయితే విరామం గడువు పొడగింపు ఉండదు. మిత్రదేశాలు లేదా ఇతర ఏర్పాట్లకు సమయం అవసరమైతేనే పొడగింపు ఉండనున్నది. అందుకే ఇరాన్ కూడా చర్చలు జరగడం లేదు.. కేవలం సందేశాలను మాత్రమే వింటున్నామని ప్రకటించింది. అదేసమయంలో ఇరాన్ కూడా ప్రపంచంపై ఒత్తిడి పెంచేందుకు సాధ్యమైనంత వరకు అమెరికా దళాలు ఇరాన్ లోకి అడుగుపెట్టకుండా చూసుకోవడంతోపాటు హోర్ముజ్‌పై పట్టు కొనసాగించి యుద్ధాన్ని మరింత కాలం పొడిగించడమే టార్గెట్‌గా పెట్టుకున్నది. చమురు అందకపోతే చాలా దేశాలకు ముఖ్యంగా భారత్, చైనా, యూరప్ దేశాలకు ఊపిరి ఆగిపోయినట్టే అవుతుంది. అందుకే ప్రపంచం ఒత్తిడి పెంచితే అది అమెరికాపై ప్రభావం చూపుతుందని ఇరాన్ ప్లాన్. అప్పుడు ఇరాన్ పెట్టే షరతులకు అమెరికా అంగీకరించాల్సి వస్తుంది. ఆ టైమ్ వరకు యుద్ధాన్ని పొడగించాలని ఇరాన్ అనుకుంటున్నది. అయితే, అమెరికా దళాలు భూతల దాడులకు (గ్రౌండ్ ఇన్వేషన్)కి దాదాపు సిద్ధమైనట్టు తెలుస్తున్నందున వారు ఎక్కడనుంచి ఇరాన్ లోకి అడుగుపెడతారన్నది ఇప్పుడు అందరిలోనూ మెదులుతున్న సందేహం.. అమెరికా ఇరాన్‌పై గ్రౌండ్ ఇన్వేషన్ ప్రారంభించాలనుకుంటే, ప్రధానంగా మూడు వైపుల నుండి జరిగే అవకాశం ఉంది. దక్షిణాన పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ తీర ప్రాంతాల నుండి ఉభయచర దాడుల ద్వారా బందర్ అబ్బాస్, చాబహార్ వంటి కీలక ఓడరేవులను లక్ష్యం చేసుకోవచ్చు. పశ్చిమాన ఇరాక్ సరిహద్దుల నుండి, తూర్పున ఆఫ్ఘనిస్తాన్ లేదా పాకిస్తాన్ సరిహద్దుల వద్ద ఉన్న అమెరికా అనుకూల స్థావరాల నుండి కూడా చొచ్చుకు రావొచ్చు. అయితే, ఇరాన్ భౌగోళికం చాలా క్లిష్టమైనది. జగ్రోస్ పర్వత శ్రేణులు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయి. కాబట్టి అమెరికా తన దాడులను టెహ్రాన్ వరకు తీసుకెళ్లకుండా, కేవలం చమురు నిల్వలున్న ఖర్గ్ ఐలాండ్, బుషెహర్ అణు ప్లాంట్‌తోపాటు దక్షిణ తీర ప్రాంతాల నియంత్రణకే పరిమితం చేసే అవకాశం ఉంది. పూర్తిస్థాయి ఆక్రమణ కంటే ఇరాన్ ఆర్థిక, సైనిక వెన్నెముకను విరిచేలా ఈ 'లిమిటెడ్ గ్రౌండ్ ఆపరేషన్' సాగవచ్చు. ఈ స్థాయి యుద్ధానికి అమెరికాకు అయ్యే ఖర్చు ఊహాతీతం. ఇరాక్, అఫ్గానిస్తాన్ యుద్ధాల అనుభవాలను బట్టి చూస్తే, ఇరాన్ వంటి పటిష్టమైన సైన్యం ఉన్న దేశంతో యుద్ధానికి ప్రాథమికంగానే 2 నుండి 3 ట్రిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. అమెరికా ఇందులో ఎం1 అబ్రమ్స్ ట్యాంకులు, బ్రాడ్లీ ఫైటింగ్ వెహికల్స్, స్ట్రైకర్ ఆర్మ్డ్ వెహికల్స్ మరియు వేల సంఖ్యలో హమ్వీలను వినియోగిస్తుంది. వీటికి అదనంగా గాలిలో ఆధిపత్యం కోసం ఎఫ్-35, ఎఫ్-22 స్టెల్త్ విమానాలతోపాటు భూగర్భ బంకర్లను ఛేదించే 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్' (ఓఏబీ) వంటి శక్తివంతమైన ఆయుధాలను వాడుతున్నది. కేవలం ఆయుధాలకే కాకుండా, లక్షలాది మంది సైనికులకు అవసరమైన లాజిస్టిక్స్, ఇంధనం మరియు వైద్య సహాయం కోసం రోజుకు వందల కోట్ల రూపాయల వ్యయం చేయాల్సి ఉంటుంది. నిజానికి యుద్ధ సమయాల్లో ఒక్కో సైనికుడికి జీతాలతోపాటు అతడికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఏడాదికి దాదాపు ఒక మిలియన్ డాలర్లు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే 3ట్రిలియన్ల అప్పుల్లో ఉన్న అమెరికాకు ఇది ఊహించని షాక్ లాంటిది. యుద్ధం పొడగిస్తే మాత్రం అమెరికా మరో ఐదేళ్లపాటు ద్రవ్యోల్బణంలో మునిగిపోతుంది. రాజ్యాంగపరంగా చూస్తే అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ఆమోదం లేకుండా అధ్యక్షుడు పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రకటించలేరు. అయితే, 'వార్ పవర్స్ యాక్ట్ (1973)' ప్రకారం, అమెరికా భద్రతకు ముప్పు ఉందనే నెపంతో అధ్యక్షుడు కాంగ్రెస్ అనుమతి లేకుండానే 60 నుంచి గరిష్ఠంగా 90 రోజుల పాటు సైనిక చర్యకు ఆదేశించవచ్చు. ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో ఇరాన్‌పై కఠిన చర్యలకు మొగ్గు ఉన్నప్పటికీ, గ్రౌండ్ ఇన్వేషన్‌కు పూర్తి స్థాయిలో ఆమోదం లభించడం కష్టం. అధ్యక్షుడు తనకున్న 'ఆర్టికల్ 2' అధికారాలను ఉపయోగించి 'పరిమిత దాడులు' లేదా 'డిఫెన్సివ్ యాక్షన్' పేరుతో సైన్యాన్ని పంపవచ్చు. సాధారణంగా ఇలాంటి కీలక దాడులకు ముందు కాంగ్రెస్ ఆథరైజేషన్ ఆఫ్ యూజ్ ఆఫ్ మిలిటరీ ఫోర్స్ (ఏయూఎంఎఫ్) అనే తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంటుంది, దీనికి సంబంధించి చర్చలు ప్రస్తుతం వాషింగ్టన్‌లో అంతర్గతంగా జరుగుతున్నాయి, కానీ అధికారిక ఆమోదం రావడానికి మరికొన్ని వారాలు పట్టవచ్చు. హౌతీలు బాబ్ ఎల్-మండేబ్‌ను బ్లాక్ చేస్తే ప్రపంచ వాణిజ్యం స్తంభిస్తుంది. ఎర్ర సముద్రం ద్వారా యూరప్, ఆసియా మధ్య జరిగే 12% వాణిజ్యం ఆగిపోతుంది. దీనివల్ల వస్తువుల ధరలు, ముఖ్యంగా ఆహారంతోపాటు ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతాయి. అన్నిటికంటే ప్రమాదకరమైనది ఏమిటంటే, ఆ సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుల్స్. ఒకవేళ హౌతీలు వీటిని ధ్వంసం చేస్తే, ఆసియా- యూరప్ మధ్య డిజిటల్ కనెక్షన్ కట్ అయ్యి బ్యాంకింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమవుతాయి. ఇది కేవలం ఒక యుద్ధం కాదు, గ్లోబల్ ఎకానమీకి ఒక 'బ్లాక్ హోల్'లా మారుతుంది. ఒకవేళ మండేబ్ పూర్తిగా బ్లాక్ అయితే, అమెరికా తన మిత్రదేశాలతో కలిసి యెమెన్‌పై కూడా పరిమిత భూతల దాడికి దిగే ప్రమాదం ఉంది. ఇది యుద్ధాన్ని మరింత సంక్లిష్టంగా మార్చి, మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే పరిస్థితులు కూడా లేకపోలేదు. అంతిమంగా యుద్ధం చర్చలతోనే ముగిసిపోతే ఆర్థికవ్యవస్థలు చావు అంచుకువెళ్లి వచ్చినంత ఊరటనిస్తుంది.. పొరపాటు నిర్ణయాలు తీసుకుంటే చరిత్ర వారిని దోషులుగా నిలబెడుతుందన్నది వాస్తవం.

# అమెరికా సాంకేతికతపై ఇరాన్ సవాలు

పశ్చిమాసియాలో 2026 ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధం కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాక, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఏకధ్రువ ప్రపంచ క్రమం కుప్పకూలుతున్న ఒక చారిత్రక ఘట్టంగా పరిణమించింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ', 'ఆపరేషన్ రోరింగ్ లయన్' ప్రారంభంలో కొన్ని విజయాలను సాధించినప్పటికీ, ఇరాన్ పటిష్టమైన యుద్ధతంత్రం, అసిమెట్రిక్ యుద్ధ నైపుణ్యం ముందు ఆ అగ్రరాజ్యాల సాంకేతిక గర్వం నీరుగారిపోయింది. ముఖ్యంగా, అమెరికా గర్వపడే గగనతల నిఘా వ్యవస్థలకు వెన్నెముకవంటి అవాక్స్ విమానాన్ని ఇరాన్ కూల్చివేయడం,ఆ దేశపు రక్షణ వ్యవస్థలోని లొసుగులను ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ యుద్ధం కేవలం సైనికపరంగానే కాకుండా, ఆర్థికంగా కూడా అమెరికాను దివాలా అంచుకు నెట్టివేసింది. అదే సమయంలో ఇజ్రాయెల్ ఒక పరాన్న దేశంగా తన ఉనికిని కాపాడుకోవడానికి ఎంతగా అమెరికాపై ఆధారపడి ఉందో స్పష్టమైంది. రష్యా, చైనా, ఇండియా వంటి ఎదుగుతున్న శక్తులు ఇప్పుడు ఏకమై ఒక చిన్న తోపు తోస్తే, పాత ప్రపంచ క్రమం అంతమై ఒక నూతన బహుధ్రువ ప్రపంచం ఆవిర్భవించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మార్చి 2026 చివరి వారంలో జరిగిన ఒక కీలక పరిణామం యుద్ధగమనాన్ని పూర్తిగా మార్చివేసింది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌మీద ఇరాన్ జరిపిన డ్రోన్, మిస్సైల్ దాడిలో అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన ఇ-3 సెంట్రీ(అవాక్స్) విమానం ధ్వంసమైంది. ఈ విమానం కేవలం ఒక వాహనం కాదు. అది గగనతలంలో కదిలే ఒక కమాండ్ సెంటర్. ఇది సుమారు 250 మైళ్ల (375 కిలోమీటర్లు) పరిధిలోని ప్రతి చిన్న కదలికను -అవి డ్రోన్లు కావచ్చు, క్షిపణులు కావచ్చు, యుద్ధవిమానాలు కావచ్చు- అన్నింటినీ గుర్తించి సమాచారాన్ని అందిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతోనే అమెరికా ప్రపంచ దేశాలపై ఇన్నాళ్లూ తన పెత్తనాన్ని చలాయించింది. అయితే ఇరాన్ తన పటిష్టమైన యుద్ధతంత్రంతో ఈ 'కదిలే రాడార్'ను మట్టుబెట్టడం ద్వారా అమెరికా గగనతల ఆధిపత్యాన్ని సవాలు చేసింది.

అవాక్స్‌ను కోల్పోవడంవల్ల అమెరికా సైన్యానికి యుద్ధ రంగంలో ఏం జరుగుతుందో తెలియని 'అంధత్వం' ఏర్పడింది. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఉన్న రాడార్లపై ఆధారపడాల్సి రావడం, అవి కూడా ఇరాన్ దాడులకు గురవుతుండడంతో అమెరికా రక్షణ వ్యవస్థలో తీవ్రమైన అసమతుల్యత ఏర్పడింది. నిఘా విమానమైన ఇ-3 సెంట్రీ (అవాక్స్) పూర్తిగా ధ్వంసం కావడంతో 270 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. కెసి-135 స్ట్రాటోట్యాంకర్ యుద్ధ విమానాల్లో ఒకటి కూలిపోగా, ఐదు ధ్వంసమయ్యాయి. ఇవి ఒక్కో విమానం 165 మిలియన్ డాలర్లు ఉంటుంది. ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు మూడు కూలిపోయాయి. ఇవి ఒక్కోటి 100 మిలియన్ డాలర్లు ఉంటుంది. అత్యాధునిక జెట్ అయిన ఎఫ్-35ఎ లైట్నింగ్ ఎఎ అత్యవసర ల్యాండింగ్ అయి ధ్వంసమైంది. దీనికి 82.5 మిలియన్ డాలర్లు ఉంటుంది. దాదాపు పన్నెండుకు పైగా ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు కూలిపోయాయి. వీటితో 30- 40 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రక్షణ రాడార్ ఎఎన్/ టిపివై-2 (థాడ్) ధ్వంసం కావడంతో 500 మిలియన్ డాలర్ల నష్టం జరిగింది. దీనిని విశ్లేషిస్తే, అమెరికా తన అత్యాధునిక సాంకేతికతను ఇరాన్ వంటి దేశం ఎదురుదాడులనుంచి కాపాడుకోవడంలో విఫలమైందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఎఫ్-15ఇ విమానాలు కువైట్ విమానాల ద్వారా పొరపాటున కూల్చివేయబడడం, అమెరికా నాయకత్వంలోని కూటమిలో సమన్వయ లోపాన్ని సూచిస్తోంది. అమెరికా తన అత్యంత ఖరీదైన క్షిపణి రక్షణ వ్యవస్థ అయిన థాడ్ (టర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్), దాని రాడార్ ఎఎన్/టివివై-2పై అమితమైన విశ్వాసాన్ని ఉంచింది. ఈ వ్యవస్థ అంతరిక్షం నుంచి వచ్చే హైపర్సోనిక్ క్షిపణులను కూడా గుర్తించగలదు. కానీ ఇరాన్ యుద్ధం ఒక 'సాంకేతిక వైరుధ్యాన్ని' బయటపెట్టింది. కోట్లాది డాలర్ల విలువైన ఈ రాడార్




వ్యవస్థలు కేవలం 35,000 డాలర్ల విలువ చేసే చిన్న డ్రోన్ల దాడికి ఛిద్రమైపోయాయి. జోర్డాన్‌లోని మువాఫక్ సల్తీ ఎయిర్ బేస్ వద్ద ఉన్న ఎఎన్/టిపివై-2 రాడార్ ఇరాన్ దాడుల్లో ధ్వంసం కావడం అమెరికాకు కోలుకోలేని దెబ్బ. ఈ రాడార్లు ఒకచోట స్థిరంగా ఉండడంవల్ల శత్రువులకు సులభమైన లక్ష్యాలుగా మారుతున్నాయి. అత్యాధునిక రాడార్ అరేలు ఎంత సున్నితంగా ఉంటాయంటే, ఒక చిన్న పేలుడు కూడా ఆ వ్యవస్థను పూర్తిగా పనికిరాకుండా చేయగలదు. ఈ వైఫల్యం వల్ల ఇరాన్‌నుంచి వచ్చే క్షిపణులను గుర్తించడంలో జాప్యం జరుగుతోంది. ఇది ఇజ్రాయెల్, ఇతర గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను మరింత ప్రమాదంలోకి నెట్టివేస్తోంది. ఈ యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావాన్ని చూపుతోంది. ఇప్పటికే 39 ట్రిలియన్ డాలర్ల రుణభారంతో ఉన్న అమెరికా, ఈ యుద్ధం కోసం అదనంగా 200 బిలియన్ డాలర్ల అత్యవసర నిధుల కోసం పెంటగాన్ ద్వారా వైట్ హౌస్‌ను కోరింది. యుద్ధం మొదలైన మొదటి మూడు వారాల్లోనే సుమారు 3 బిలియన్ డాలర్ల విలువైన సైనిక పరికరాలు ధ్వంసమయ్యాయి. అమెరికా ట్రెజరీ బాండ్ల మార్కెట్, సాధారణంగా యుద్ధ సమయాల్లో సురక్షితమైన పెట్టుబడిగా భావించబడుతుంది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. పెట్టుబడిదారులు అమెరికా ప్రభుత్వం తన అప్పులను తీర్చగలదా అనే అనుమానంతో బాండ్లను విక్రయిస్తున్నారు. దీనివల్ల గ్లోబల్ బాండ్ మార్కెట్ నుంచి మార్చి నెలలోనే 2.5 ట్రిలియన్ డాలర్ల విలువ ఆవిరైపోయింది. ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం, పెట్రోల్ ధరలు గ్యాలన్‌కు 4 డాలర్లకు చేరువ కావడం అమెరికా సామాన్యుడి నడ్డి విరుస్తోంది. ఈ గణాంకాలు అమెరికా ఆర్థికంగా ఎంత పటిష్టమైన దేశమో నిరూపిస్తున్నాయి. ప్రపంచంలో డాలర్ ఆధిపత్యం తగ్గిపోతుండడం ఈ పతనానికి ప్రధాన సంకేతం. ఇజ్రాయెల్ తన సాంకేతిక నైపుణ్యంతో ఇరాన్‌పై దాడులు చేస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఆ దేశం అమెరికా ఇచ్చే 'సైనిక ప్రాణవాయువు' (స్ట్రాటజిక్ ఆక్సిజన్ పైపులైన్) మీద పూర్తిగా ఆధారపడి ఉందని అర్థమవుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గతంలో తాము స్వయం సమృద్ధి సాధిస్తామని ప్రగల్భాలు పలికినప్పటికీ, యుద్ధం మొదలైన కొద్ది రోజుల్లోనే ఆ దేశ మందుగుండు సామాగ్రి నిల్వలు నిండుకున్నాయి. అమెరికా సరఫరా చేసే మందుగుండు లేకపోతే ఇజ్రాయెల్ ఒక్క వారం కూడా యుద్ధం చేయలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'గా (వార్ఎకానమీ) మారిపోయింది. పౌర రంగాలు, పర్యాటకం, వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయాయి.

కేవలం సైనిక ఎగుమతులు మాత్రమే ఆ దేశాన్ని కాపాడుతున్నాయి. 2024లో 15బిలియన్ డాలర్ల రక్షణ ఎగుమతులు చేసిన ఇజ్రాయెల్, ఇప్పుడు తన ఉనికి కోసం ప్రతి వనరును యుద్ధానికే మళ్లిస్తోంది. ఇది ఇజ్రాయెల్‌ను ఒక 'సూపర్ స్పార్టా' దేశంగా మార్చేసింది. అంటే నిరంతరం యుద్ధం మీదనే ఆధారపడే స్థితి. మార్చి 4, 2026న ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒక అణుబాంబు వంటి ప్రభావాన్ని చూపింది. ప్రపంచంలోని 20% చమురు సరఫరా, గణనీయమైన గ్యాస్ సరఫరా ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఇరాన్ ఇప్పుడు ఈ మార్గాన్ని తన నియంత్రణలోకి తీసుకొని, చమురు రవాణా చేసే నౌకల నుంచి సుంకాలను కేవలం చైనీస్ యువాన్‌లో మాత్రమే వసూలు చేస్తోంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి పడిన అతిపెద్ద దెబ్బ. చైనా క్రాస్-బోర్డర్ పేమెంట్ సిస్టమ్‌ద్వారా లావాదేవీలు జరగడం వల్ల అమెరికా ఆంక్షలు నిర్వీర్యమయ్యాయి. గల్ఫ్ దేశాలు కూడా ఇప్పుడు అమెరికా రక్షణ కవచం బలహీనపడడంతో తమ ఆర్థిక మార్గాలను చైనా వైపు మళ్లిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధం ఒక సరికొత్త భౌగోళిక రాజకీయ మార్పును తెచ్చినట్టు కనిపిస్తోంది. అమెరికా అస్థిరమైన నాయకత్వాన్ని చూసిన జపాన్, జర్మనీ వంటి దేశాలు కూడా ఇప్పుడు తమ భద్రత కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. రష్యా బహిరంగంగా అమెరికా దాడులను ఖండిస్తూనే, తెరవెనుక ఇరాన్‌కు ఉపగ్రహ సమాచారాన్ని, డ్రోన్ యుద్ధతంత్రాలను అందిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధంలో బిజీగా ఉన్నప్పటికీ, ఇరాన్‌ను అమెరికా పతనానికి ఒక ఆయుధంగా రష్యా వాడుకుంటోంది. చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే ఆర్థికంగా అమెరికాను దెబ్బతీస్తోంది. ఇరాన్‌కు ఆర్థిక అండగా నిలుస్తూ, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) కూటమి ద్వారా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమాన్ని నిర్మిస్తోంది. భారతదేశం వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తూనే, తన ఇంధన భద్రత కోసం రష్యా, ఇరాన్‌లతో సంబంధాలను కొనసాగిస్తోంది. అమెరికా బలహీనపడడంవల్ల దానికి సాగిలపడకపోతే ఇండియా వంటి దేశాలకు ప్రపంచ స్థాయిలో నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం పెరుగుతుందనుకోవచ్చు. జపాన్, జర్మనీ దేశాలు ఇన్నేండ్లూ అమెరికా రక్షణ గొడుగు కింద ఉన్నాయి. కానీ ఇప్పుడు అమెరికా స్వయంగా యుద్ధంలో చిక్కుకోవడంతో, అవి తమ రక్షణ వ్యయాన్ని పెంచుకుంటూ సొంత వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. 2026 ఇరాన్ యుద్ధం అమెరికా అజేయత అనే భ్రమను తొలగించింది. ప్రపంచ పెద్దన్నగా చలామణి అవుతున్న అమెరికా, ఇప్పుడు తన సొంత ఆర్థిక సమస్యలు, సైనిక వైఫల్యాలతో సతమతమవుతోంది. ఇజ్రాయెల్ తన మనుగడకోసం పూర్తిగా ఇతరులపై ఆధారపడే బలహీన దేశంగా మిగిలిపోయింది. ఇరాన్ చూపిన పటిష్టమైన యుద్ధతంత్రం, ఆధునిక సాంకేతికత కంటే వ్యూహాత్మక ధైర్యం గొప్పదని నిరూపించింది. ఇప్పుడు రష్యా, చైనా, ఇండియా వంటి శక్తులు ఏకమై ఆర్థిక, రాజకీయ ఒత్తిడిని కొనసాగిస్తే, పాత సామ్రాజ్యాల పతనం పూర్తి కావడం ఖాయం. ప్రపంచం ఇప్పుడు ఏకధ్రువ ఆధిపత్యం నుంచి బహుళ ధ్రువ సహకారంవైపు అడుగులు వేస్తోంది. ఇది కేవలం ఒక యుద్ధం ముగింపు కాదు. ఒక నూతన శకానికి ఆరంభం. అమెరికా ఇక ఎంతమాత్రం ప్రపంచ గమనాన్ని శాసించలేదు.

# అసమాన శాస్త్ర పరిశోధకుడు

విలియం క్రూక్స్ ప్రఖ్యాత బ్రిటిష్ భౌతిక, రసాయన శాస్త్రవేత్త. క్రూక్స్ రేడియో వికిరణ మాపకం ఆవిష్కర్త. అయన ఉత్సర్గ నాళం రూపకల్పనకు మార్గదర్శి. థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. రాయల్ కాలేజ్ ఆఫ్ కెమిస్ట్రీ, లండన్ లో వర్ణపట శాస్త్రం పై విస్తృత పరిశోధనలు చేశాడు. ఆయన తయారుచేసిన ఉత్సర్గ నాళాన్ని క్రూక్స్ నాళం అనికూడా అంటారు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలెనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొనబడ్డాయి. ఆయన కేంద్రక రేడియో ధార్మికతను అధ్యయనం చేయుటకు ఉపయోగించే పరికరంను కనుగొన్నాడు. పదార్థం స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. క్రూక్స్ తన జీవన గమనంలో ఒక అంతరిక్ష శాస్త్రవేత్తగా, ఉపన్యాసకునిగా వివిధ ప్రాంతాలలో పనిచేశాడు. భౌతిక, రసాయన శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు. తన పరిశోధన ముఖ్య లక్షణము ప్రయోగముల ద్వారా వివిధ భావనలను, వాస్తవాలను కనుగొనుటగా భావించాడు. ఆయన అభిరుచు లయిన అనువర్తిత భౌతిక శాస్త్రము, ఆర్థిక, ప్రాయోగిక సమస్యలు, మానసిక సంబంధమైన పరిశోధనలు, ఆయనను ఉన్నత వ్యక్తిగా నిలిపింది. ఆయన అనేక అవార్డులు, గౌరవాలను పొందాడు. ఆయన జీవితం ఒక అసాధారణ శాస్త్రీయ కృత్యాలలతో మమేకం అయింది. సర్ విలియం క్రూక్స్ లండన్ లో 1832 జూన్ 17 లో జన్మించాడు. 1850 నుండి 1854 మధ్య కాలంలో ఆయన కళాశాలలో సహాయకునిగా పనిచేశాడు. అనతి కాలంలో ఆయన కర్బన రసాయన శాస్త్రంలో కాకుండా ఆయనకు ఇష్టమైన రంగంలో ఆయన గురువు విల్‌హెల్మ్ వోన్ హోఫ్మాన్న్ ప్రేరణతో ప్రవేశించాడు. ఆయన పరిశోధనల ఫలితంగా సెలెనియం యొక్క సంయోగ పదార్థములు కనుగొన బడ్డాయి. ఆయన మొదటి పరిశోధనా పత్రాలను 1851 లో ప్రచురించాడు. ఆయన ఆక్స్‌ఫర్డ్ లో రాడ్‌క్లిఫ్ అబ్సర్వేటరీ విభాగంలో 1854 లో, ఛెస్టర్ డియోసియన్ ట్రయినింగ్ కళాశాలలో 1855లో ఉపన్యాసకునిగా పనిచేశాడు. 1859 లో ఆయన కెమికల్ న్యూస్ అనే విజ్ఞానశాస్త్ర పత్రికను ప్రారంభించాడు. అనేక సంవత్సరాలు ఆ పత్రికలో వివిధ మార్పులు చేస్తూ నిర్వహించి అన్ని విజ్ఞాన శాస్త్ర జర్నల్స్ లో అగ్రగామిగా నిలిపాడు. 1861 లో క్రూక్స్ థాలియం అనే క్రొత్త మూలకాన్ని కనుగొన్నాడు. ఈ మూలకం వర్ణపటంలో ఆకుపచ్చని కాంతిని ఉద్గారం చేయుటను గమనించాడు. గ్రీకు భాషలో థల్లోస్ అంటే ఆకుపచ్చని ఉద్గారం అని అర్థము. అలా దానికి థాలియం అని నామకరణం చేశాడు. థాలియంను వర్ణపట విశ్లేషణ సహాయంతో కనుగొన్నాడు. ఆ నూతన ఆవిష్కరణ ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చి తెచ్చింది. ఆయన 1863 లో రాయల్ సొసైటీకి ఫెలోగా ఎంపికయ్యాడు. ఆయన క్రూక్స్ నాళంను అభివృద్ధి చేశాడు. తద్వారా ఋణధృవ కిరణాల ఆవిష్కరణ జరిగింది. ఆయన అనేక పరిశోధనా పత్రాలను వర్ణపట శాస్త్రం పై ప్రచురించాడు. అల్ప పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింపజేయు పరిశోధనలలో ఆయన అతి తక్కువ పీడనం వద్ద వాయువుల గుండా విద్యుత్ ను ప్రవహింప జేసినపుడు ఋణ ధృవం (కాథోడ్) నుండి కొన్ని కిరణాలు ఉద్గారమగు చున్నట్లు కనుగొన్నాడు. వాటికి "ఋణధృవ కిరణాలు" అని పిలిచాడు. యివి ప్రస్తుతం స్వేచ్ఛా ఎలక్ట్రాన్ల ప్రవాహంగా పిలువ బడు తున్నాయి. ప్రస్తుతం ఇవి కాథోడ్ కిరణ నాళాలలో ఉపయోగ పడుతున్నాయి. ఈ ఉదాహరణల నుండి ఆయన భౌతిక దృగ్విషయాలను అధ్యయనం చేయుటకు ఉపయోగపడే ఉత్సర్గ నాళాల తయారీలో ప్రసిద్ధి పొందాడు. 1879 లో ఆయన పదార్థం యొక్క స్థితులలో (ఘన, ద్రవ, వాయు) నాల్గవ స్థితి అయిన ప్లాస్మాను కనుగొనుటలో, ఆ స్థితిని గుర్తించుటలో మొదటి శాస్త్రవేత్తగా నిలచాడు. క్రూక్స్ ఋణధృవ కిరణాలు లక్షణాలపై పరిశోధనలు చేశాడు. అవి ఋజుమార్గంలో ప్రయాణిస్తాయని, అవి వస్తువులపై పడినపుడు ప్రతిదీప్తిని కలుగ జేస్తాయని కనుగొన్నాడు. పదార్థంలో నాల్గవ స్థితి అయిన "ప్లాస్మా" స్థితిని ఆయన కనుగొన్నాడు. దానికి "రేడియంట్ మేటర్" అని పిలిచాడు. ఋణ ధృవ కిరణాలు అనేవి కొన్ని కణాల ప్రవాహమని నమ్మాడు. ఆ తర్వాత జె.జె.థామ్సన్ వాటిని కనుగొనడానికి భూమికను ఏర్పరచాడు. కాథోడ్ కిరణాలలో గల కణాలకు ఎలక్ట్రాన్ లుగా గుర్తించాడు. క్రూక్స్ చేసిన పరిశోధనల వల్ల భౌతిక, రసాయన శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా పరమాణువులో కొత్త కణాల ఆవిష్కరణకు మార్గం సుగమమైంది. 1880 తర్వాత క్రూక్స్ ప్రైవేటు ప్రయోగ శాలలో తన పరిశోధనలను చేశాడు. 1895 లో విలియం క్రూక్స్ హీలియం నమూనాను గుర్తించాడు. 1903 లో ఆయన తన దృష్టిని రేడియో ధార్మికత దృగ్విషయాలపై నిలిపాడు. యురేనియం -ఛీ (తర్వాత ప్రొటాక్టీనియంగా పిలువ బడుతున్నది. యురేనియాన్ని రేడియో ధార్మిక పరివర్తన ఆధారంగా వేరుచేయ గలిగాడు. ఉత్తేజిత పరివర్తన ఆధారంగా యురేనియం నుండి రేడియో ధార్మిక విఘటనాన్ని గమనించాడు. అదే సమయంలో ఆయన రేడియో ధార్మిక పదార్థం నుండి వెలువడే "జూ-కణముల"ను కనుగొన్నాడు. ఈ కణాలు జింక్ సల్ఫైడ్ తెరను ప్రభావితం చేయుట గమనించాడు. క్రూక్స్ 1909 లో "డైమండ్స్" అనే చిన్న పుస్తకాన్ని రాశాడు. 1910లో క్రూక్స్ "ఆర్డర్ ఆఫ్ మెరిట్"ను పొందాడు. ఆయన తన భార్య మరణానంతరం 2 సంవత్సరాల తర్వాత లండన్ లో 4 ఏప్రిల్ 1919 లో మరణించాడు.

# రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సమీకృత భూ భారతి పోర్టర్

**ప్రారంభించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్ మండలశీ భూ భారతి పోర్టర్ పైలెట్ ప్రాజెక్టుగా కావడం జరిగింది అని ఎంపిక. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు.

భూ భారతి పోర్టల్ ద్వారా రైతులకు మేలు జరుగుతుంది.

భూవివాదాలకు శాశ్వత పరిష్కారం అవుతుంది అని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం.ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలుఅందుతున్నాయి.ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ సమీకృత భూభారతి పోర్టల్ రూపకల్పన.15 అంశాల డ్యాష్ బోర్డును ఈ పోర్టల్ లో రూపొందించం.రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మొదట విడత పూర్తి చేశాం..రెండవ విడత, మూడో విడతలను త్వరలో విడుదల చేస్తాం.కల్వకుర్తి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు. భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమీకృత పోర్టల్ రూపకల్పన చేసినట్టు మంత్రి తెలిపారు. కేవలం భూపరిపాలనకు సంబంధించిన సమాచారమే కాకుండా సర్వే వివరాలు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సమాచారం కూడా అందుబాటులో ఉండేలా ఈ పోర్టల్ ప్రారంభించడం జరిగిందని రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మైల్యాండ్ పోర్ట్ఫోలియో, నాలా ఆర్డర్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల వివరాలు, ఫీడ్బ్యాక్, అధికారుల వివరాలు, ఆర్వోఆర్-1బీ, ఎల్పీఎం,భూదార్, దరఖాస్తులు, సిటిజన్ చార్టర్, డౌన్లోడ్స్,



మ్యుటేషన్ ఆర్డర్లు, భూముల మార్కెట్ విలువలు, భూనక్షా, ధరణి కంటే ముందునాటి ఈసీలు, ఫీజుల రీఫండ్ వివరాలతో కూడిన 15 అంశాల డ్యాష్బోర్డును ఈ పోర్టల్లో రూపొందించామని. డ్యాష్బోర్డులోని ఒక్కో అంశంపై క్లిక్ చేస్తే దానికి సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమవుతుందని అధికారులు చెప్పారు. ముఖ్యంగా ఈ పోర్టల్లో ఐదు రకాల సేవలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సమాచారం, సర్వే, తప్పొప్పుల సవరణ, అప్పీల్, రిజిస్ట్రేషన్ సర్వీసులనూ ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామని అన్నారు. రాష్ట్రంలోని భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు,ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రైతులకు పారదర్శక, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ సమీకృత భూభారతి పోర్టల్ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్ను ప్రయోగాత్మకంగా అమల్లోకి తేవడం ద్వారా భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో , పిసిసి అధికార ప్రతినిధి బాలాజీ సింగ్,మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మెకానిక్ బాబా, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో అభివృద్ధి అజెండాపై చర్చలు

**ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి సాధ్యం**

**సర్పంచ్ మానస రామకృష్ణ**

**అగ్నిధార న్యూస్ ,(వెంకటాపురం):**

వెంకటాపురం మండలంలోని ఉప్పెడు వీరాపురం గ్రామపంచాయతీలో సర్పంచ్ జెజ్జరి మానస రామకృష్ణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి ప్రధాన అజెండాగా చర్చలు కొనసాగాయి.ఈ సందర్భంగా సర్పంచ్ మానస రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

### సంక్షేమ పథకాల అమలుపై దృష్టి

గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతోందన్నారు.



గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అందరూ కలిసి పనిచేస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అధికారుల సూచనలు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్యేక అధికారి సంజీవరావు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో జమీలాల్ గ్రామంలో అభివృద్ధి పనుల అమలుపై తన అభిప్రాయాలను వెల్లడించారు.గ్రామపంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు సమావేశ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండెల ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవానికి నాంది 'మాలపిల్ల'

## డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్

## తొలినాటి చలనచిత్రాల్లోనే కుల నిర్మూలన గళం

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

తెలుగు చలనచిత్ర రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సామాజిక మార్పుకు ఆయుధంగా మలచిన గొప్ప చిత్రం 'మాలపిల్ల' అని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ కొనియాడారు. 1938లోనే కుల వివక్షపై గళమెత్తిన ఈ చిత్రం నేటి తరానికి ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'మాలపిల్ల' చిత్రంపై ప్రత్యేక విశ్లేషణ చేశారు.

### అంటరానితనంపై ధిక్కార స్వరం

గూడవల్లి రామబ్రహ్మం గారు దర్శకత్వం వహించిన 'మాలపిల్ల' చిత్రం అప్పట్లో సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్షను, అంటరానితనాన్ని సూటిగా ప్రశ్నించిందని డాక్టర్ నగేష్ గుర్తు చేశారు. "మాలపిల్ల" కేవలం ఒక సినిమా కాదు, అదొక సామాజిక ఉద్యమం. అగ్రవర్ణాల్లోని మూఢాచారాలను, దళితుల పట్ల చూపే అమానుష వైఖరిని ఈ చిత్రం ఎండగట్టిందని ఆయన వివరించారు.

### గాంధేయవాదం - సామాజిక సంస్కరణ

చిత్రంలో చూపిన విధంగా... హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించడం, అక్షరాస్యత ద్వారా చైతన్యం తీసుకురావడం వంటి అంశాలు అప్పట్లో సంచలనం సృష్టించాయని నగేష్ పేర్కొన్నారు. తాపీ ధర్మారావు గారి సంభాషణలు, చౌదరి గారి విప్లవాత్మక గీతాలు కుల రహిత సమాజం కోసం పరితపించాయని, ముఖ్యంగా బాబాసాహెబ్ అంబేద్కర్ గారు కోరుకున్న కుల నిర్మూలన సిద్ధాంతాలకు ఈ చిత్రం చేరువగా నిలిచిందని ఆయన విశ్లేషించారు.

?"కులం అనేది మనుషుల మధ్య గోడలు కట్టకూడదు. 'మాలపిల్ల' చిత్రంలో నాయకుడు సుందర రామశాస్త్రి పాత్ర ద్వారా కులాతీత ప్రేమను, మానవత్వాన్ని చాటిచెప్పడం అప్పట్లోనే ఒక గొప్ప సాహసం." – డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్

### నేటి కాలానికి అవశ్యం

నేటి ఆధునిక కాలంలో కూడా అక్కడక్కడా కుల వివక్ష తల ఎత్తుతున్న తరుణంలో, 'మాలపిల్ల' వంటి చిత్రాల సందేశం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. కళలు అనేవి సమాజంలోని రుగ్మతలను కడిగేసేలా ఉండాలని, ఆ వారసత్వాన్ని నేటి సినీ మేకర్లు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. సమతా సైనిక దళ్ ఎల్లప్పుడూ ఇటువంటి సామాజిక చైతన్యాన్ని సమర్థిస్తుందని, కులరహిత సమాజ స్థాపన కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో 'మాలపిల్ల' వంటి కళాఖండాల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తామని డాక్టర్ నగేష్ స్పష్టం చేశారు.

# ఫీజుల వసూలు నిర్ణయం దుర్మార్గం

**సమతా సైనిక దళ్**

**పేద విద్యార్థుల చదువులకు గండి కొట్టడమే..**

**డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ఆగ్రహం**

**అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):**

ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల పేరుతో విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు సూచించడం పట్ల సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యానికి పేద విద్యార్థులను బలిపశువులను చేయడం తగదని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు.పేదలకు విద్యను దూరం చేయడమే.:ఫీజు రీయింబర్స్మెంట్ నమ్ముకుని వేలాది మంది దళిత, బహుజన, మైనారిటీ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయని, అయితే దీనికి పరిష్కారంగా విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేయమనడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. లక్షలాది రూపాయల ఫీజులు కట్టే స్తోమత లేకనే పేద విద్యార్థులు రీయింబర్స్మెంట్ పథకంపై ఆధారపడుతున్నారని, ఇప్పుడు యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే విద్యార్థులు చదువు మానేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించాలి: గత నాలుగేళ్లుగా సుమారు రూ. 7,500 కోట్ల బకాయిలు పేరుకుపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని డాక్టర్ నగేష్ విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం ఫీజులు ఇస్తే తిరిగి ఇచ్చేయండి" అనే ప్రతిపాదన హాస్యాస్పదంగా ఉందని, అసలు ఫీజులు కట్టే శక్తి ఉంటే విద్యార్థులు పథకం కోసం ఎందుకు ఎదురుచూస్తారని ఆయన ప్రశ్నించారు. కళాశాల యాజమాన్యాలు కూడా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలే తప్ప విద్యార్థులను వేధించవద్దని సూచించారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం తన స్పష్టమైన వైఖరిని ఏప్రిల్ 30 లోగా ప్రకటించాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# రామగుండం మాజీ కౌన్సిలర్ రంగు భారతి రోడ్డు ప్రమాదంలో మృతి

**అగ్ని ధార న్యూస్, ( రామగుండం):** రామగుండం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శ్రీమతి రంగు భారతి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వైపు వెళ్తుండగా, మార్గమధ్యంలో రామగుండం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌పై ప్రమాదానికి గురయ్యారు.ఈ ప్రమాదంలో రంగు భారతి రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రంగు భారతి ఆకస్మిక మృతితో స్థానికంగా విషాద వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధిగా ఆమె సేవలను పలువురు గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని కోరుతున్నారు.

# వేసవిలో వడదెబ్బపై అప్రమత్తం

## జాగ్రత్తలు పాటించకపోతే అనారోగ్య సమస్యలు

**డీఎంహెచ్‌వో డా. ప్రమోద్ కుమార్**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**



వేసవి కాలంలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. కె. ప్రమోద్ కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు జాగ్రత్తలు వివరించారు.ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండలోకి వెళ్లకుండా ఉండాలని, అత్యవసరమైతే తలకు రక్షణ కల్పించేలా గొడుగు, టోపీ వాడాలని సూచించారు. చెప్పులు లేకుండా బయటకు వెళ్లవద్దని, ఎండ సమయంలో అధిక శ్రమకు దూరంగా ఉండాలని తెలిపారు.

### ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి

దాహం వేయకపోయినా తరచుగా నీరు తాగాలని, ప్రయాణాల సమయంలో తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ వంటి పానీయాలు తీసుకోవాలని చెప్పారు. తర్బూజ, ద్రాక్ష, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉన్న పండ్లు తీసుకోవాలని సూచించారు.

టీ, కాఫీ, మద్యం, కూల్‌డ్రింక్స్ వంటి పానీయాలు శరీరంలో నీటి శాతం తగ్గించే అవకాశం ఉన్నందున వీటిని తగ్గించాలని పేర్కొన్నారు.

### కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు

పని ప్రదేశాల్లో చల్లని త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, ప్రతి 20 నిమిషాలకు నీరు తాగించేలా చూడాలని యజమానులకు సూచించారు. కార్మికులకు నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దు

తలనొప్పి, వికారం, మూర్ఛ, అధిక దాహం, వేగంగా గుండె కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి వెళ్లి ద్రవాలు తీసుకోవాలని సూచించారు. పరిస్థితి విషమిస్తే వెంటనే వైద్య సేవలు పొందాలని తెలిపారు.హీట్ స్ట్రోక్ అత్యవసర పరిస్థితి కావడంతో బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.వల్నరబుల్ వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ శిశువులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, ఆరుబయట పనిచేసే కార్మికులు అధిక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డా. ప్రమోద్ కుమార్ తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చన్నారు.

## రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సమీకృత భూ భారతి పోర్టర్

**ప్రారంభించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్ మండలశీ భూ భారతి పోర్టర్ పైలెట్ ప్రాజెక్టుగా కావడం జరిగింది అని ఎంపిక. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. భూ భారతి పోర్టల్ ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. భూవివాదాలకు శాశ్వత పరిష్కారం అవుతుంది అని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం.ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలుఅందుతున్నాయి.ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ సమీకృత భూభారతి పోర్టల్ రూపకల్పన.15 అంశాల డ్యాష్ బోర్డును ఈ పోర్టల్ లో రూపొందించం.రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మొదట విడత పూర్తి చేశాం..రెండవ విడత, మూడో విడతలను త్వరలో విడుదల చేస్తాం.కల్వకుర్తి నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు. భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమీకృత పోర్టల్ రూపకల్పన చేసినట్టు మంత్రి తెలిపారు. కేవలం భూపరిపాలనకు సంబంధించిన సమాచారమే కాకుండా సర్వే వివరాలు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సమాచారం కూడా అందుబాటులో ఉండేలా ఈ పోర్టల్ ప్రారంభించడం జరిగిందని రంగారెడ్డి జిల్లాలో ఆమనగల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. మైల్యాండ్ పోర్ట్ఫోలియో, నాలా ఆర్డర్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల వివరాలు, ఫీడ్బ్యాక్, అధికారుల వివరాలు, ఆర్వోఆర్-1బీ, ఎల్పీఎం,భూదార్, దరఖాస్తులు, సిటిజన్ చార్టర్, డౌన్లోడ్స్, మ్యుటేషన్ ఆర్డర్లు, భూముల మార్కెట్ విలువలు, భూనక్షా, ధరణి కంటే ముందునాటి ఈసీలు, ఫీజుల రీఫండ్ వివరాలతో కూడిన 15 అంశాల డ్యాష్బోర్డును ఈ పోర్టల్లో రూపొందించామని. డ్యాష్బోర్డులోని ఒక్కో అంశంపై క్లిక్ చేస్తే దానికి సంబంధించిన సమగ్ర సమాచారం లభ్యమవుతుందని అధికారులు చెప్పారు. ముఖ్యంగా ఈ పోర్టల్లో ఐదు రకాల సేవలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సమాచారం, సర్వే, తప్పొప్పుల సవరణ, అప్పీల్, రిజిస్ట్రేషన్ సర్వీసులనూ ఈ పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెచ్చామని అన్నారు.రాష్ట్రంలోని భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు,ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రైతులకు పారదర్శక, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ సమీకృత భూభారతి పోర్టల్ను తయారు చేశామన్నారు. ఈ పోర్టల్ను ప్రయోగాత్మకంగా అమల్లోకి తేవడం ద్వారా భూ వివాదాల శాశ్వత పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మెకానిక్ బాబా, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నీ సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన బెక్కర బాల్ రెడ్డి నీ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన వెంకటాపూర్ గ్రామ ఉప సర్పంచ్ నశీబు ఇస్తారి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, ఐలేను ,సంతోష్, తది తరులు పాల్గొన్నారు.

# మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాపా నిఖిల్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండలంలోని మాధారం గ్రామానికి చెందిన మాదే పెద్ద చెన్నమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలు కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కాంగ్రెస్ నాయకుల ద్వారా 5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిధార
http://www.agnidharanews.com


# బహిష్కృత భారత్” స్ఫూర్తితో అక్షర పోరాటం అవసరం

డా. మార్షల్ దుర్గం నగేష్
అగ్ని ధార న్యూస్ (పెద్దపల్లి):

అణగారిన వర్గాల హక్కుల సాధనలో అక్షరాన్ని ఆయుధంగా మలిచిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రారంభించిన “బహిష్కృత భారత్” పత్రిక ఆవిర్భావం సామాజిక చరిత్రలో మైలురాయిగా నిలిచిందని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. 1927 ఏప్రిల్ 3న మరాఠీ భాషలో ప్రారంభమైన ఈ పక్ష పత్రిక అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని రగిలించి, వారి సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చిన గొప్ప వేదికగా నిలిచిందన్నారు. మహద్ సత్యాగ్రహం అనంతరం పెరిగిన సామాజిక అణచివేతకు ప్రతిస్పందనగా, అణగారిన వర్గాలకు స్వరంగా నిలిచే అవసరంతోనే ఈ పత్రికను అంబేద్కర్ స్థాపించారని వివరించారు. వర్ణవ్యవస్థపై డా. అంబేద్కర్ సాగించిన అక్షర పోరాటం సమాజాన్ని ఆలోచింపజేసిందని, అసమానతలపై ఆయన చేసిన విమర్శలు నేటికీ ప్రాసంగికంగా ఉన్నాయని తెలిపారు. “స్వయం సేవ” మరియు “పోరాటం” అనే సిద్ధాంతాలతో అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిన పత్రికగా “బహిష్కృత భారత్” నిలిచిందన్నారు. ఆహార అలవాట్ల పేరుతో జరుగుతున్న వివక్షను అంబేద్కర్ శాస్త్రీయంగా ఖండించారని, తర్కంతో ప్రశ్నిస్తూ సమానత్వ భావనను బలపరిచారని గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో మీడియా రంగం విలువలు కోల్పోతూ వాణిజ్య ధోరణులకు లోనవుతోందని నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాల్సిన పత్రికలు తమ బాధ్యతను విస్మరిస్తున్నాయని విమర్శించారు. “మొక్కకు నీరు ఎంత అవసరమో, సిద్ధాంతానికి ప్రచారం అంతే అవసరం” అనే బాబాసాహెబ్ సందేశాన్ని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. “బహిష్కృత భారత్” స్ఫూర్తితో అజ్ఞాన చీకట్లను అక్షర వెలుగులతో పారద్రోలుతూ, సామాజిక న్యాయం సాధనకు కట్టుబడి ముందుకు సాగాలని ఆయన సూచించారు.

# వేముల వర్సెస్ కోమటిరెడ్డి

**హైదరాబాద్ :** తెలంగాణలో హ్యామ్ రోడ్డు టెండర్ల చుట్టూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. రూ. 8 వేల కోట్ల స్కామ్ జరుగుతోందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాటిని తీవ్రంగా ఖండించారు. టెండర్లు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పారదర్శకంగా జరుగుతున్నాయని.. తనపై బురద చల్లడం మానుకోవాలని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఈ వివాదం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో అభివృద్ధి, పలు శాఖల్లో అవినీతిపై సభ్యులు విమర్శలు గుప్పించుకున్నారు. ఇక తాజాగా.. రాష్ట్ర రాజకీయం రోడ్ల అభివృద్ధి, హ్యామ్ టెండర్ల చుట్టూ తిరుగుతోంది. తనపై, ప్రభుత్వంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అవినీతి ఆరోపణలను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన వ్యక్తిత్వాన్ని, పనితీరును ఉద్దేశించి మంత్రి కీలక కామెంట్స్ చేశారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదన్నారు. తాను నిప్పు లాంటి వ్యక్తినని.. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. కనీసం ఆరోపణలు కూడా రాలేదని.. అలాంటిది తన శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని కోమటిరెడ్డి మండిపడ్డారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల్లో భారీ స్కామ్ జరుగుతుందన్న విమర్శలను కోమటిరెడ్డి ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని అన్నారు. పారదర్శకంగానే రోడ్ల నిర్మాణం జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు




కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి ఏమాత్రం అవగాహన లేదని విమర్శించారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి వేముల ప్రశాంత్ రెడ్డికి కనీస జ్ఞానం లేదన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. కాగా, రోడ్ల అభివృద్ధి పేరిట తీసుకొస్తున్న హ్యామ్ రోడ్స్ విధానంలో రూ.8 వేల కోట్ల స్కాం జరుగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి ఇటీవల ఆరోపించారు. 6 వేల కిలోమీటర్ల హ్యామ్ మోడల్ రోడ్లకు రూ. 13 వేల కోట్లతో టెండర్ల పిలిచారన్నారు. మొబిలైజేషన్ కింద 10 శాతం అంటే రూ. 1300 కోట్లు ముందే ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యిందని ఆరోపించారు. ఈ టెండర్‌లో ఎక్సెస్ టెండర్ వేసుకోవాలని ప్రభుత్వమే సలహాలు ఇవ్వటాన్ని ఆయన తప్పుబట్టారు. హ్యామ్ మోడల్ రోడ్ల విషయంలో రేవంత్ ప్రభుత్వం మరోసారి రివ్యూ చేసుకోవాలని సూచించారు. ఈ రోడ్లను జేఇంఫ్రా , బృందా ఇంఫ్రా కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాని.. ఈ కంపెనీలకు అనుభవం లేదని.. ఆర్అండ్‌బీలో పనులు చేసిన దాఖలాలు లేవని అన్నారు. దీనిపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలకు తాజాగా కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# మైనార్టీలే గెలుపు డిసైడ్...

**తిరువనంతపురం :** కేరళ జనాభాలో ముస్లింలు సుమారు 26 శాతం, క్రైస్తవులు సుమారు 18 శాతం... కలిపి దాదాపు 45 శాతం పైగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు తరచుగా హిందూ–ముస్లిం ధ్రువీకరణ చుట్టూ తిరుగుతుంటే, కేరళలో మాత్రం ఈ రెండు మైనారిటీ వర్గాల మొగ్గు ఎటువైపు ఉంటే ఆ కూటమి అధికార పీఠాన్ని అధిరోహిస్తుంది. దశాబ్దాలుగా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు ఈ వర్గాలే కొండంత అండగా ఉంటూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలు కాంగ్రెస్ కూటమిలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లు గంపగుత్తగా యూడీఎఫ్‌కే పడేవి. ఉత్తర కేరళలోని మలప్పురం , వయనాడ్ జిల్లాలు మైనారిటీ రాజకీయాలకు కేంద్రబిందువులు. మలప్పురంలో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఇక్కడ ముస్లిం లీగ్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. అలాగే వయనాడ్ వంటి చోట్ల ముస్లిం, క్రైస్తవ ఓటర్ల కలయిక అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. ఈ జిల్లాల్లో మెజారిటీ స్థానాలను సాధించకుండా ఏ కూటమి కూడా తిరువనంతపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం కూడా ఈ మైనారిటీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసిన వ్యూహమే. ప్రస్తుతం ప్రియాంకాగాంధీ వయనాడ్ ఎంపీగా ఉన్నారు. గతంలో మైనారిటీ ఓట్లు కేవలం కాంగ్రెస్ సొత్తని భావించేవారు, కానీ ఇటీవలి కాలంలో ఎల్డీఎఫ్ ఈ కోటలోకి చొచ్చుకెళ్లింది. మతతత్వ శక్తులను అడ్డుకోగల ఏకైక శక్తి కమ్యూనిస్టులేననే ప్రచారంతో ముస్లిం యువతను ఎల్డీఎఫ్ ఆకట్టుకుంది. అలాగే కేరళ కాంగ్రెస్ ఎం వంటి క్రైస్తవ ప్రాధాన్యత గల పార్టీని తమ కూటమిలోకి చేర్చుకోవడం ద్వారా మధ్య కేరళలోని క్రైస్తవ ఓటు బ్యాంకులో ఎల్డీఎఫ్ పట్టు సాధించింది. 2021లో ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి గెలవడానికి ఈ మైనారిటీ ఓట్ల చీలిక , మళ్లింపు ప్రధాన కారణం. ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నెముకలా ఉన్న క్రైస్తవ ఓటర్లలో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. చర్చిల్లో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు వారి ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తున్నాయి. జేకోబైట్ చర్చి వంటి వర్గాలు ఎల్డీఎఫ్‌కు మద్దతు తెలపడం యూడీఎఫ్‌కు గట్టి దెబ్బ.

# కబ్జా కోరల్లో చెరువులు

**వరంగల్ :** చినుకు పోసుకోకపోతే గత ఏడాది వర్షాకా లంలో పడ్డ తిప్పలు మళ్ళీ పడాల్సిన పరిస్థితి ఎదురవక తప్పదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వందలాది చెరువులు, కుంటలు, నాళాలు కబ్జా కోరల్లో చిక్కిపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా చెరువులు, కుంటలు ఉండగా అందు లో వెయ్యికి పైగా చెరువులు, కుంటలు అధిక విస్తీర్ణంలో కబ్జాలకు గురైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టణాల్లో ఉన్న చెరువులను ఆక్రమించిన కొందరు అందులో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, గ్రామస్థాయిలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమించిన వారు అందులో వ్యవసాయం చేయడం వల్ల చెరువులు, కుంటలు నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి రోజు రోజుకు కుంచించుచకుపోతున్నానే విమర్శలు వస్తున్నాయి. అలాగే వరద (నాళాలు) కాలువలను ఆక్రమించడం వల్ల వర్షం నీరు కుంటలు, చెరువుల్లోకి చేరే పరిస్థితి లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన చెరువులుగా గుర్తించిన వాటిని సైతం ఆక్రమిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. చెరువులు, కుంటల బఫర్ జోన్, ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్ టి ఎల్) పరిధిలను దాటేసి కూడా కొందరు చెరువుల్లోకి చొరబడి చెరువులను చెరబడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వంలోని వివిధ శాఖల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలకు నిర్ణీత దూరంలో బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ ఉండాల్సి ఉండగా, ఎక్కడ కూడా అటువంటి పరిస్థితి లేదనే విమర్శలు వస్తున్నాయి. కుంటలు, చెరువుల ఆక్రమణ రోజురోజుకు పెరిగిపోయి పట్టణాలు, పల్లెలో వర్షాకాలం వరదల ముంపు తీవ్రత పెరగడానికి కారణంగా మారిందని ఆరోపిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ లో కురిసిన భారీ వర్షాలకు త్రీ నగరి గా పేరుగాంచిన వరంగల్ రోడ్లన్నీ నదులుగా మారడం, ఎక్కడి నీరు అక్కడే తిష్ట వేసి అనేక కాలనీలు రోజుల తరబడి జలదిగ్బంధంలో చిక్కుకొని భారీగా ఆస్తులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైళ్ల రాకపోకల తో పాటు, రోడ్డు రవాణా కూడా పూర్తిగా స్తంభించిపోయింది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికార వర్గాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం, దీనికి తోడు ఆక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం, ఆక్రమించిన చెరువులు, కుంటలు, నాళాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ సౌకర్యం కల్పించడం విమర్శలకు తావిస్తోంది. దీనివల్ల చెరువులు, కుంటలు, నాళాల విస్తీర్ణం రోజురోజుకు కూచించుకుపోయి, భవిష్యత్తులో చెరువులు, కుంటలు, నాళాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో వరద నీరు చెరువుల్లోకి వెళ్లకుండా, దిగువకు వెళ్ళిపోయి భూగర్భ నీటిమట్టం స్థాయి తగ్గుతుందనే విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటలు, నాళాల ఆక్రమణలను తొలగించడానికి ‘హైడ్రా’ ఏర్పాటుచేసిన విధంగా ప్రతి జిల్లాలో కూడా చెరువులు, కుంటలు, నాళా లు, ఇతర అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడానికి ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలనిప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటలు, నాళాలు ఆక్రమించిన వారిని తొలగించాలని, భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణ లు జరగకుండా పటిష్టమైన కార్యాచరణ చేపట్టి చెరువులు, కుంటలు, నాళాల రక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి.

## ఓబిసి సెల్ రాష్ట్ర చైర్మన్ వీర్లపల్లి శంకర్ నీ సన్మానించిన కాసు శ్రీనివాస్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ గా నియమితులైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నీ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానం చేసిన అనంతరం అభినందించి శుభాకాంక్షలు తెలిపిన తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శతాబ్ది టౌన్షిప్ చైర్మన్ లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,

## తలకొండపల్లి మండల క్రైస్తవ సోదరులకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల క్రైస్తవ సోదరులందరికీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి గుడ్ ఫ్రైడే శుభాకాంక్షు తెలిపారు. ఈ సందర్భంగా ఏసు క్రీస్తు త్యాగం, ధైర్యంను ఆయన గుర్తు చేసుకున్నారు. ఏసు ప్రభు ప్రేమ, కృప కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలకు ఉండాలని అభిలషించారు. శాంతి, కరుణ సందేశాలతో పాటు క్రీస్తు నేర్పిన సేవ, దయ, సోదరభావం ఇప్పటికీ, ఎప్పటికీ మానవాళికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచానికి ప్రేమతత్వం బోధించిన దయామయుడు, సిలువపై ఏసుక్రీస్తు త్యాగం మహోన్నతమైనదని ‘గుడ్ ఫ్రైడే’ సందేశం అని సందర్భంగా దోకూరి ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. యేసు క్రీస్తు త్యాగాలకు జ్ఞాపకంగా జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదర సోదరీమణులందరూ ఘనంగా జరుపుకోవాలని తలకొండ పల్లి మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి కోరారు.

## సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలి

మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

అమరనాథ్ యాత్రగా పిలువబడే అత్యంత మహిమాన్విత క్షేత్రమైన మరో అమరనాథ్ యాత్రగా పిలవబడే సలేశ్వరం జాతరను మరో రెండు రోజులు పొడగించాలని జిల్లెల్ల మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని పత్రిక మఖంగా కోరారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు,తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి దర్శణార్థం వస్తుంటారని అన్నారు.. భక్తుల రద్దీ ఎక్కువ కావడం, రోజులు తక్కువ ఉండడంతో స్వామివారిని దర్శంచుకోలేక, వెనుదిరుగుతున్నారన్నారు. మూగజీవాలకు, పర్యావరణ ప్రకృతికి విఘాతం కలుగకుండ అందరు భక్తులు దర్శించుకునేలా చూ డాలని, అలాగే ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వచ్చిన భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాదకరమని, గతంలో కూడా శ్రీశైలం పుణ్యక్షేత్రంలో, కేరళలోని అయ్యప్పస్వామి క్షేత్రంలో భక్తులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం బాధాకరమన్నారు. భక్తులకు సరైన వసతులు కల్పించి, వారికి ఇబ్బందులు కలుగకుండ అద్యాత్మికతను అందించే బాధ్యత ప్రభుత్వాని దేనని, భక్తులు కంట్రోల్ కావడం లేదని లాఠీచార్చి చేయడం ఎంటని ప్రశ్నించారు. గతంలో ఈ యాత్ర 9 రోజులు, ఆ తర్వాత 5 రోజులు, ఇప్పుడు 3 రోజులకు కుదించడం భక్తుల మనోభావాలకు ఇబ్బందులు కలిగించడమేనని అన్నారు. అలాగే ఫారెస్టు అధికారులు ఒక్కొ వాహనం నుండి 500 రూపాయలు టోల్ ఫీజు వసూళ్లు చేశారని, భక్తుల దగ్గర ఒక్కొక్కరికి 30 రూపాయలు వసూలు చేశారని, కానీ సౌకార్యాలు మాత్రం గతంలో మాదిరిగానే ఉన్నాయని. అభివృద్ధి లేదన్నారు. ఆలయాల దగ్గర భక్తుల మనోభావాలకు ఇబ్బం దులు కలిగిస్తే చూస్తు ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని సలేశ్వరం జతరను మరో రెండు రోజులు పొడిగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన పత్రిక ముఖంగా కోరారు.

## హెడ్ ఆఫీస్ ముట్టడికి వచ్చిన కార్మికులకు కృతజ్ఞతలు

వన్ ఇంక్లైన్ కార్మికులతో మడ్డి ఎల్లా గౌడ్ భేటీ

అగ్నిధార న్యూస్,(రామగుండం) :

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి హాజరైన వన్ ఇంక్లైన్ కార్మికులకు ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లా గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు మార్చి 30న ‘చలో కొత్తగూడెం’ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికుల ఐక్యత అభినందనీయమని పేర్కొన్నారు. శుక్రవారం కార్మికులను కలిసిన ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు హరించబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన, సంస్థ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. ముట్టడి సందర్భంగా ఏఐటీయూసీ ఉంచిన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే, అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, ఫిట్ కమిటీ నాయకులు కలవేణి రాజేష్, కొప్పుల లింగయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, నేరెళ్ళ తిరుపతి, రమేశ్ గౌడ్, వీరగోని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ ఆఫీస్ ముట్టడికి వచ్చిన కార్మికులకు కృతజ్ఞతలు

వన్ ఇంక్లైన్ కార్మికులతో మడ్డి ఎల్లా గౌడ్ భేటీ

అగ్నిధార న్యూస్,(రామగుండం) :

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన హెడ్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి హాజరైన వన్ ఇంక్లైన్ కార్మికులకు ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లా గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిలుపు మేరకు మార్చి 30న ‘చలో కొత్తగూడెం’ కార్యక్రమంలో పాల్గొన్న కార్మికుల ఐక్యత అభినందనీయమని పేర్కొన్నారు. శుక్రవారం కార్మికులను కలిసిన ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు హరించబడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కుల సాధన, సంస్థ పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాటాలు అవసరమని పేర్కొన్నారు. ముట్టడి సందర్భంగా ఏఐటీయూసీ ఉంచిన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే, అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మానాల శ్రీనివాస్, ఫిట్ కమిటీ నాయకులు కలవేణి రాజేష్, కొప్పుల లింగయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, నేరెళ్ళ తిరుపతి, రమేశ్ గౌడ్, వీరగోని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్య ప్రదాతలకు అరుదైన గౌరవం

మల్లెపల్లి లక్ష్మయ్య దంపతుల సన్మానం అభినందనీయం

సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్

అగ్ని ధార న్యూస్,(రామగుండం):

తెలంగాణ ఉద్యమ గళం, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య మరియు సామాజిక ఉద్యమ గాయని మల్లెపల్లి జయమ్మలకు నిర్వహించ తలపెట్టిన సన్మాన కార్యక్రమం సామాజిక స్ఫూర్తిని రగిలిస్తుందని సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ అన్నారు.?శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సింగరేణి మట్టి బిడ్డలుగా ఎదిగి, బాహుజన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన లక్ష్మయ్య దంపతులను గౌరవించుకోవడం మన బాధ్యతని పేర్కొన్నారు. ఈ నెల 5న శ్రీరాంపూర్‌లోని సీసీసీ గెస్ట్ హౌస్‌లో జరిగే ఈ ఆత్మీయ సన్మాన సభకు మేధావులు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యం కోసం పనిచేసే వ్యక్తులకు ఇలాంటి గౌరవం దక్కడం హర్షనీయమన్నారు

## బిజినెస్

### పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని మినహాయించిన ప్రభుత్వం



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్న నేపథ్యంలో పెట్రోకెమికల్ ముడిసరుకులపై ఆధారపడిన పరిశ్రమలకు కేంద్రం తాత్కాలిక ఉపశమన చర్యలను ప్రకటించింది.ప్రధానంగా వీటి ధరలు పెరిగితే, ప్రజలపై భారం పడుతుందనే కారణంతో ప్రభుత్వం పరిష్కార నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని మినహాయించింది. ఈ నిర్ణయం గురువారం(ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు పరిమిత కాలం వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దేశీయంగా పరిశ్రమలకు ముఖ్యమైన పెట్రోకెమికల్ ముడిసరుకు లభ్యత, సరఫరాకు ఇబ్బందుల్లేకుండా, వీటిపై ఆధారపడిన రంగాలకు ఖర్చుల భారం తగ్గించాలని భావిస్తున్నాం. దీనివల్ల కీలక ఫార్మా, ఆటో, టెక్స్‌టైల్స్, ప్లాస్టిక్, కెమికల్ రంగాలకు ప్రయోజనం కలుగుతుంది. సుంకం మినహాయింపు ఇచ్చిన పెట్రోకెమికల్స్‌లో మిథనాల్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, అన్‌శాచురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్, అన్‌హైడ్రస్ అమోనియా, స్టీరేన్ బ్యుటడిన్, డైక్లోరోమిథేన్, పాలీ బ్యూటడిన్ ఉన్నాయి. పాలిఇథిలీన్, పాలిప్రొపిలీన్, పాలిస్టైరీన్, పాలివినైల్ క్లోరైడ్, పాలిఇథిలీన్ టెరెఫ్థలేట్ చిప్స్ వంటి పాలిమర్లు ఉన్నాయి.

### మహీంద్రా కీలక నిర్ణయం.. ఏప్రిల్ 6 నుంచి పెరగనున్న ధరలు



మహీంద్రా వాహనాలు కొనుగోలు చేసే వారికి ఊహించని షాక్ తగిలింది. తమ వాహనాల ధరలను పెంచబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది మహేంద్రా అండ్ మహీంద్రా కంపెనీ. మార్కెట్లో మహేంద్రా కంపెనీకి మంచి డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. చాలా మంది, మిగతా కంపెనీలను కాదని ఈ మహేంద్ర కంపెనీకి సంబంధించిన కార్లు, ఇతర వాహనాలు కొనుగోలు చేస్తూ ఇంట్రెస్ట్ చూపిస్తారు. అయితే అలాంటి వారికి షాక్ ఇస్తూ, తాజాగా ఈ మహేంద్రాకు సంబంధించిన వాహనాల ధరలను అమాంతం పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. నాన్-ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను గరిష్టంగా 2.5% పెంచబోతున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. ఇక మొత్తం వాహన పోర్టు పోలియోపై ధరల పెంపు సగటున 1.6 పర్సెంటేజ్ ఉంటుందని వివరణ ఇచ్చింది మహేంద్రా కంపెనీ. ఇక పెంచిన ధరలు ఏప్రిల్ ఆరవ తేదీ నుంచి అమలులోకి వస్తాయని కీలక ప్రకటన చేసింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకుగాను తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. ఇక ఈ పెంపుదల నేపథ్యంలో మోడల్, వేరియంట్ ను బట్టి వాహనాల ధర వేరువేరుగా పెరుగుతుంది. అటు ఇటీవల మహేంద్ర నుంచి వచ్చిన చీజుం 7చీూ వెహికల్ ధర మాత్రం మొదటి నలభై వేల మంది కొనుగోలుదారులకు మాత్రమే పెరగబోదని స్పష్టం చేసింది. ఆ తర్వాత కొనుగోలు చేసిన వాళ్లందరికీ పెంపుదల వర్తిస్తుందని మహీంద్రా వెల్లడించింది.

# యుద్ధ సెగతో తయారీ రంగం కుదేలు

అమెరికా యుద్ధోన్మాదం, అధిక టారిఫ్‌లు భారత తయారీ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోన్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణతో మార్చి నెలలో తయారీ రంగ పీఎంఐ 53.9కి పడిపోయిందని హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) వెల్లడించింది. ఇంతక్రితం నెల ఫిబ్రవరిలో 56.9 పాయింట్లుగా ఉండగా.. మార్చి నాటికి అది ఒక్కసారిగా 53.9 పాయింట్లకు తగ్గి నాలుగేండ్ల కనిష్టానికి దిగజారింది. జూన్ 2022 తర్వాత నమోదైన అత్యల్ప ఉత్పత్తి ఇదే కావడం గమనార్హం. సాధారణంగా 50 పైన ఫఈఎంఐ ఉంటే మెరుగ్గా.. దిగువన ఉంటే ప్రతికూలంగా ఉన్నట్లుగా గుర్తిస్తారు. గత రెండేండ్లలో ఎప్పుడూ లేనంతగా కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం మందగించాయి. ముడిసరుకుల ధరలు మూడున్నరేండ్ల గరిష్టానికి చేరడం తయారీదారుల నడ్డి విరుస్తోంది. ఖర్చులు పెరిగినా పోటీ తట్టుకోవడానికి విక్రయ ధరలను పెంచలేకపోవడం వల్ల కంపెనీల లాభాలు ఆవిరవుతున్నాయి. డిమాండ్ తగ్గడం, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి భారత పారిశ్రామిక వేగాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయని హెచ్‌ఎస్‌బీసీ విశ్లేషించింది. "తీవ్రమైన మార్కెట్ పోటీ, ముడిసరుకుల ధరల పెరుగుదల, అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి వల్ల కొత్త ఆర్డర్ల ప్రవాహం నెమ్మదించింది. ముఖ్యంగా అల్యూమినియం, రసాయనాలు, ఇంధనం, జనపనార, తోలు, వస్త్రాలు, ఉక్కు వంటి వస్తువుల ధరలు గత మూడేండ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. దీనివల్ల తయారీదారులపై పెట్టుబడి భారం పెరిగినప్పటికీ, వినియోగదారులకు చేరే తుది వస్తువుల ధరలను కంపెనీలు ప్రస్తుతానికి నియంత్రణలోనే ఉంచుతున్నాయి." అని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రాంజల్ భండారీ పేర్కొన్నారు. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి సామర్థ్యం 2022 మధ్య కాలం తర్వాత ఎన్నడూ లేనంత నిదానంగా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతినడం, మార్కెట్ పరిస్థితులు సవాలుగా మారడంతో డిమాండ్ భారీగా మందగించింది. ముడి ఖర్చులు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, ఉన్న కస్టమర్లను కాపాడుకోవడానికి, కొత్త వారిని ఆకర్షించడానికి కంపెనీలు తమ విక్రయ ధరలను పెంచలేకపోతున్నాయి. దీనివల్ల తయారీదారుల లాభాల మార్జిన్లు కుంచించుకుపోతున్నాయి. అంతిమంగా పెరుగుతున్న వ్యయాలు, తగ్గుతున్న డిమాండ్‌తో భారత పరిశ్రమలు కుదేలవుతున్నాయి.



# తీవ్ర ఆర్థిక సంక్షోభ దిశగా భారత్

దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం దిశగా సాగుతోందని మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) అరవింద్ సుబ్రమణ్యం హెచ్చరించారు. యుద్ధం వల్ల చమురు, గ్యాస్, ఎరువుల సరఫరా నిలిచిపోవడం వల్ల దేశ జిడిపి 1 శాతం పైగా పడిపోయి, ద్రవ్యోల్బణం 1.5 శాతం పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఎంతో కాలం కొనసాగవని, చివరికి సామాన్యుడిపై ధరల భారం పడక తప్పదని విశ్లేషించారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన స్తబ్దత ముప్పులో ఉందన్నారు. అంతర్జాతీయంగా చమురు, సహజ వాయువు, ఎరువుల సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన భారత్ రెండంచుల నష్టాన్ని చవి చూడబోతోందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా రెస్టారెంట్లు మూతపడటం వంటి ఆర్థిక మందగమన సంకేతాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కడానికి ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వీలైతే అక్కడ నుండి తక్కువ ధరకే ఇంధన, ఎరువుల నిల్వలను యుద్ధ ప్రాతిపదికన సేకరించాలని సుబ్రమణ్యం సూచించారు. దేశీయంగా ఎక్సైజ్ సుంకాల కోత, సబ్సిడీల వంటి చర్యలు స్వల్పకాలిక ఉపశమనాన్ని ఇచ్చినప్పటికీ సుదీర్ఘ కాలం పాటు పెరిగిన భారాలను ప్రభుత్వం మోయలేదన్నారు. చివరికి ఆ భారం సామాన్య వినియోగదారుడిపైనే వేయనుం దన్నారు. భారీ అప్పుల కారణంగా ప్రభుత్వాలకు ఆర్థికంగా నిలదొక్కుకునే శక్తి తగ్గిపోవడం ఈ సంక్షోభంలో మరో ప్రధాన ప్రతికూలాంశమన్నారు. రూపాయి విలువ పతనం కావడం కూడా విధానకర్తలకు ఒక గట్టి సవాలేనని అన్నారు. ఈ సంక్షోభాన్ని ఒక గుణపాఠంగా భావించి, భవిష్యత్తులో శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్నారు.. దీర్ఘకాలిక వ్యూహంతో పునరుత్పాదక ఇంధన వనరులను పెంచుకోవడం, కీలక వస్తువుల వ్యూహాత్మక నిల్వలను నిర్మించుకోవడం ద్వారానే ఇలాంటి ప్రపంచ స్థాయి దిగ్బంధనాలను ఎదుర్కోగలమన్నారు.



# చరిత్ర సృష్టించిన చెన్నై సూపర్ కింగ్స్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చరిత్ర సృష్టించింది. ఐపీఎల్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ స్కోర్లు చేసిన జట్టుగా అవతరించింది. 2026 ఎడిషన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో ఇవాళ (ఏప్రిల్ 3) జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోర్ చేసిన ఆ జట్టు.. 36వ సారి 200 ప్లస్ మార్కును తాకింది. ఈ మ్యాచ్‌కు ముందు వరకు ఈ రికార్డు సీఎస్‌కే, ఆర్సీబీ (35) పేరిట సంయుక్తంగా ఉండేది. ఈ విభాగంలో సీఎస్‌కే, ఆర్సీబీ తర్వాతి స్థానాల్లో పంజాబ్ కింగ్స్ (32), ముంబై ఇండియన్స్ (31), కేకేఆర్ (29) ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక టీమ్ స్కోర్ రికార్డు సన్‌రైజర్స్ హైదరాబాద్ పేరిట ఉంది. 2024 ఎడిషన్‌లో ఆ జట్టు 3 వికెట్ల నష్టానికి ఏకంగా 287 పరుగులు చేసింది. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే ఆయుశ్ మాత్రే (73) అర్ధ సెంచరీతో సత్తా చాటడంతో భారీ స్కోర్ చేసింది. శివమ్ దూబే (45 నాటౌట్), సర్ఫరాజ్ ఖాన్ (32) ఓ మోస్తరు స్కోర్లతో రాణించగా.. రుతురాజ్ గైక్వాడ్ (28) పర్వాలేదనిపించాడు. సంజూ శాంసన్ (7), కార్తీక్ శర్మ (1) నిరాశపరిచారు. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ 2, చహల్, జన్సెన్, బార్ట్‌లెట్ తలో వికెట్ తీశారు. అనంతరం 210 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ సైతం ధాటిగా ఆడుతుంది. 8 ఓవర్లలోనే ఆ జట్టు వికెట్ నష్టానికి 88 పరుగులు చేసింది. ప్రియాంశ్ ఆర్య (39) విధ్వంసం సృష్టించి ఔట్ కాగా.. ప్రభ్‌సిమ్రన్ (38), కూపర్ కన్నోల్లీ (7) క్రీజ్‌లో ఉన్నారు. ప్రియాంశ్ ఆర్యను మ్యాట్ హెన్రీ క్లీన్ బౌల్డ్ చేశాడు.



## స్పోర్ట్స్

### సత్తా చాటిన శ్రేయస్.. పంజాబ్ ఖాతాలో వరుసగా రెండో విజయం



ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ (ఏప్రిల్ 3) జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కేపై పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో విజయాలు నమోదు చేసింది. సీఎస్‌కే విషయానికొస్తే.. ఈ జట్టుకు ఇది వరుసగా రెండో ఓటమి. తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి, తాజాగా పంజాబ్ చేతిలో పరాజయంపాలైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆయుశ్ మాత్రే (73) అర్ధ సెంచరీతో సత్తా చాటగా.. శివమ్ దూబే (45 నాటౌట్), సర్ఫరాజ్ ఖాన్ (32) రాణించారు. రుతురాజ్ గైక్వాడ్ (28) పర్వాలేదనిపించగా.. సంజూ శాంసన్ (7), కార్తీక్ శర్మ (1) నిరాశపరిచారు. పంజాబ్ బౌలర్లలో విజయ్ కుమార్ 2, చహల్, జన్సెన్, బార్ట్‌లెట్ తలో వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనను ధాటిగా ప్రారంభించిన పంజాబ్ మరో 8 బంతులు మిగిలుండగానే (18.4 ఓవర్లు) 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆదిలో ప్రియాంశ్ ఆర్య (39) విధ్వంసం సృష్టించి ఔట్ కాగా.. ప్రభ్‌సిమ్రన్ (43), కూపర్ కన్నోల్లీ (36), శ్రేయస్ అయ్యర్ (50) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌లు ఆడి గెలుపుకు పునాది వేశారు. ఆఖర్లో శశాంక్ సింగ్ (14 నాటౌట్), స్టోయినిస్ (9 నాటౌట్) ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా పంజాబ్‌ను గెలుపు తీరాలు దాటించారు. సీఎస్‌కే బౌలర్లలో మ్యాట్ హెన్రీ, అన్షుల్ కంబోజ్ తలో 2 వికెట్లు తీశారు. సీఎస్‌కే సొంతగడ్డపై భారీ స్కోర్ చేసినా, దాన్ని కాపాడుకోలేకపోయింది.

# త్వరలో ఐపీఎల్‌లో 94 మ్యాచ్‌లు..?

ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్యను పెంచేందుకు బీసీసీఐ కసరత్తులు చేస్తోంది. భవిష్యత్తులో మొత్తం మ్యాచ్‌ల సంఖ్యను 94కు పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. ప్రస్తుతం 10 జట్లతో ఐపీఎల్ సీజన్‌లో 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. 2021 వరకు ఐపీఎల్‌లో 8 జట్లే ఉండగా.. తర్వాతి ఏడాది కొత్తగా గుజరాత్ టైటాన్స్, లఖ్‌నవూ జెయింట్స్ రావడంతో ఈ సంఖ్య పదికి చేరింది. మ్యాచ్‌లు 60 నుంచి 74కి పెరిగాయి. ప్రస్తుతం.. ప్రతి సీజన్‌లో ఒక్కో ఫ్రాంచైజీ.. ఇతర జట్లలోని ఐదింటితో రెండుసార్లు, నాలుగు జట్లతో ఒక్కోసారి తలపడుతోంది. అనంతరం ఫైనల్ సహా ప్లేఆఫ్స్‌లో మొత్తం నాలుగు మ్యాచ్‌లు జరుగుతాయి. ఒకవేళ టోర్నమెంట్‌ను 94 మ్యాచ్‌లకు విస్తరిస్తే.. ప్రతి జట్టు ఇతర జట్లతో రెండుసార్లు తలపడాల్సి ఉంటుంది. తద్వారా ప్రతి సీజన్‌లో ఒక్కో జట్టు మొత్తం 18 మ్యాచ్‌లు ఆడుతుంది. టీ20 క్రికెట్‌పై అభిమానులకు ఆసక్తి పెరుగుతున్న దృష్ట్యా ఐపీఎల్‌ను మరింత విస్తృతపరచాలనే ఆలోచన ఉందని అరుణ్ ధుమాల్ పేర్కొన్నారు. అందువల్లే ఈ లీగ్‌లో 94 మ్యాచ్‌లు ఆడించాలని అనుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడు ప్రతి జట్టు వేరే జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుందన్నారు. గత కొన్నేళ్లుగా జరుగుతున్న మార్పులను గమనిస్తే, కొన్ని ద్వైపాక్షిక మ్యాచ్‌లపై ఆసక్తి తగ్గుతూ వస్తోందని.. అందుకే ఆయా దేశాలు తమ సొంత లీగ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నాయని తెలిపారు.





## నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నారు..

సీనియర్ నటి సోనాలి బింద్రే, ఆమె భర్త గోల్డీ బెహ్లాలు మహారాష్ట్రలో ఒక భూ వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పుణే సమీపంలోని లోనావాలాలో వీరికి ఉన్న ఫామ్‌హౌస్‌కు ఆనుకుని ఉన్న భూమిని ఆక్రమించుకున్నారంటూ ఒక స్థానిక రైతు అధికారులను ఆశ్రయించారు.సోనాలి దంపతులు తమ ఆస్తి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించే క్రమంలో, తన పట్టా భూమిని కలిపేసుకోవడమే కాకుండా, తన పొలానికి వెళ్లే దారిని కూడా మూసేశారని ఆ రైతు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తాను వ్యవసాయం చేసుకోలేక ఆర్థికంగా నష్టపోతున్నానని, తనకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. తాజాగా, ఈ వివాదంపై సోనాలి బింద్రే ఘాటుగా స్పందించారు. ఆ రైతు చేస్తున్నవన్నీ పచ్చి అబద్ధాలని, తాము చట్టప్రకారం కొనుగోలు చేసిన భూమిలోనే నిర్మాణాలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. “మా దగ్గర అన్ని రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయి. నిజానికి ఆ రైతు మమ్మల్ని భయపెట్టి, మా నుండి భారీగా డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నాడు. అతనే మమ్మల్ని వేధిస్తున్నాడు” అని సోనాలి ఎదురుదాడికి దిగారు. ప్రస్తుతం ఈ వివాదం రెవెన్యూ శాఖ అధికారుల వద్దకు చేరింది. అధికారులు త్వరలోనే ఆ వివాదాస్పద భూమిని సర్వే చేసి, ప్రభుత్వ రికార్డుల ప్రకారం సరిహద్దులను నిర్ణయించాలని నిర్ణయించారు. సర్వే రిపోర్ట్ వచ్చిన తర్వాతే ఆ భూమి అసలు ఎవరికి చెందుతుంది? రైతు ఆరోపణల్లో నిజమెంత? లేదా సోనాలి చెబుతున్నట్లు అది బ్లాక్ మెయిల్ ప్రయత్నమా? అనేది తేలనుంది.

# ఒక గొప్ప సినిమాలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉంది

పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్, ఇప్పుడు ఒక భారీ ప్రాజెక్టుతో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇటీవల ‘భగవంత్ కేసరి’, ‘కన్నప్ప’ వంటి చిత్రాల్లో మెరిసిన ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ‘రామాయణ’ చిత్రంలో భాగమైనట్లు అధికారికంగా ప్రకటించింది. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ నితీష్ తివారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పౌరాణిక గాథలో కాజల్ కీలక పాత్ర పోషిస్తోంది. గత కొంద్దికాలంగా ఈ సినిమాలో కాజల్ రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనుందని వార్తలు రాగా, తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా ఆ వార్తలను నిజం చేసింది. రామాయణ గ్లింప్స్‌ను షేర్ చేస్తూ.. “ప్రతి తరం శ్రీరాముడి పేరుతోనే పెరిగారు. ఇప్పుడు యావత్ ప్రపంచం మొత్తం మర్యాద పురుషోత్తముడైన ఆ రాముడిని దర్శించుకోబోతోంది. ఇలాంటి ఒక గొప్ప దృశ్యకావ్యంలో నేను కూడా భాగమైనందుకు చాలా గర్వపడుతున్నాను” అని ఎమోషనల్ నోట్ రాసుకొచ్చింది. అయితే, కాజల్‌ను సీత పాత్రలో చూడాలనుకున్న అభిమానులు, ఆమె మండోదరిగా నటిస్తుండటంతో కొంత నిరాశ వ్యక్తం చేసినా, ఆమె నటనపై మాత్రం భారీ అంచనాలు పెట్టుకున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్ వంటి దిగ్గజ నటులు నటిస్తున్నారు.



# టొవినో థామస్ సినిమా నుంచి అప్డేట్




మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ ‘పళ్లిచట్టంబి’. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు.డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ అన్నీ ఆకట్టుకోగా.. ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఇక ప్రమోషన్స్ భాగంగా ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. గుడ్ ఫ్రైడే స్పెషల్‌గా రేపు 5వ తేదీన ట్రైలర్ రాబోతున్నట్లు తెలుపుతూ.. ‘సిద్ధంగా ఉండండి.. నిరీక్షణ దాదాపు ముగిసింది.. 05-04-2026 ఉదయం 11:11 గంటలకు ట్రైలర్ రాబోతున్నది.. ‘పళ్లిచట్టంబి’ ప్రపంచాన్ని వీక్షించండి.. ఏప్రిల్ 10, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్నది’ అంటూ ఓ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్.

## ‘జెట్లీ’ నుంచి ప్రమోషనల్ సాంగ్ రిలీజ్



‘మత్తు వదలరా’ సినిమాతో ఆడియన్స్‌ను కడుపుబ్బ నవ్వించిన టాలీవుడ్ మోస్ట్ క్రేజీ కాంబో సత్య – రితేష్ రాణా ఇప్పుడు మళ్లీ ‘జెట్లీ’తో సినిమాతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేయడానికి సిద్ధం అవుతున్నారు.క్లాప్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా ‘సత్య ఈజ్ నాట్ జెట్లీ’ అనే ప్రమోషనల్ సాంగ్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రజెంట్ ఈ సాంగ్ నెట్టింట వైరల్ అవుతూ ట్రెండ్ అవుతోంది. సత్య బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా ఈ పాటను ఎంతో ఫన్నీగా, ఎనర్జిటిక్‌గా డిజైన్ చేశారు. ఈ క్రేజీ సాంగ్‌కు కాలభైరవ అదిరిపోయే ఎలక్ట్రానిక్ బీట్స్‌తో మ్యూజిక్ ఇచ్చారు.ముఖ్యంగా విజయ్ పోలకి కొరియోగ్రఫీలో సత్య వేసిన స్టెప్పులు చూస్తుంటే మతిపోవాల్సిందే. విజువల్స్ ఎంతో కలర్‌ఫుల్‌గా ఉంటూ ఆడియన్స్‌ను ఇన్‌స్టాంట్‌గా అట్రాక్ట్ చేస్తున్నాయి. సత్య కేవలం కామెడీ మాత్రమే కాదు, అద్భుతంగా డ్యాన్స్ కూడా చేయగలనని ఈ పాటతో నిరూపించారు. ప్రమోషనల్ సాంగ్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఈ సినిమాతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. గ్లామరస్‌గా కనిపిస్తూనే సత్యతో కలిసి స్టైలిష్ మూవ్స్‌తో అదరగొట్టింది. కాగా.. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com